prajathapana.com
News that matters



అల్పమైన విషయాలకై ప్రార్థించకండి, శరీర సుఖాల కోసం తాపత్రయపడితే మనుషులకు, జంతువులకు వ్యత్యాసం ఏముంటుంది?

- స్వామి వివేకానంద

సంపుటి :01 సంచిక: 40 శుక్రవారం 24 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-

# ప్రపంచ వ్యాప్తంగా 'మన్ కీ బాత్' 100వ ఎడిసోడ్ ప్రసారం

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలవారీ రేడియో ప్రోగ్రాం 'మన్ కీ బాత్' 100వ ఎడిసోడ్ ఈసారి ఇండియాలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ప్రసారం కానుంది. ఇందుకోసం భారతీయ జనతా పార్టీ భారీ సన్నాహాలు చేస్తోంది. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పుడు గ్లోబల్ నేత. ఆ కారణంగానే ప్రపంచవ్యాప్తంగా 'మన్‌కీ బాత్' కార్యక్రమం ప్రసారం చేయనున్నాం. మోదీ పనితీరును ప్రపంచ దేశాలన్నీ అభినందిస్తున్నాయి. ప్రజలు ఆయన మాటలను వినాలనుకుంటున్నారు. ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని సాధ్యమైనన్ని దేశాల్లో ప్రసారం చేయడమే మా లక్ష్యం" అని బీజేపీ వర్గాలు తెలిపాయి. 'మన్ కీ బాత్' సిరీస్‌లో మోదీ ప్రస్తావించిన ప్రతిభావంతులందరినీ గౌరవించడంతో పాటు ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు ఆయా రాష్ట్రాల్లో వారిని ఆహ్వానిస్తారనీ, అంతగా ప్రచారానికి నోచుకుని ఈ ప్రముఖులందర్నీ ఢిల్లీకి కూడా ఆహ్వానిస్తామని ఆ వర్గాలు తెలిపాయి. అనేక విశేషాలతో100వ ఎపిసోడ్‌ను ప్రసారం చేయనున్నట్టు చెప్పారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో 100 ప్రాంతాల్లో 100 మంది చొప్పున కూర్చుని ప్రధాని మన్‌కీ బాత్ వినేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా రంగాలకు చెందిన డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, సామాజిక కార్యకర్తలు, ఇతర వర్గాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్ గౌరవం అందుకున్న వారిని గౌరవించడంతో పాటు వారి స్పందనలు కూడా వినే అవకాశం ఉంది.




100వ ఎపిసోడ్ ఏప్రిల్ 30న..

ప్రధాన మంత్రి 'మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ ఏప్రిల్ 30న ప్రసారం కానుంది. ఈ ఎపిసోడ్ ఘనవిజయం సాధించేందుకు వీలుగా లక్షకు పైగా బూత్‌లలో దీనిని టెలికాస్ట్ చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. 2014 అక్టోబర్ 3న 'మన్ కీ బాత్' తొలి ఎపిసోడ్ ప్రారంభమైంది. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైనప్పటికీ ఏమాత్రం గుర్తింపునకు నోచుకోని వారి సేవలను 'మన్ కీ బాత్' ద్వారా వెలుగులోకి తేవడం జరుగుతోంది. వీటితో పాటు వాతావరణ మార్పులు, వ్యవసాయం, కళలు, సంస్కృతి, ఆరోగ్యం వంటి అంశాలు సందర్భానుసారంగా ఈ ప్రోగ్రాంలో చోటుచేసుకుంటున్నాయి. యావద్దేశాన్ని ఏకతాటిపైకి తేవడం, సమష్టి అభివృద్ధి సాధన లక్ష్యంగా 'మన్ కీ బాత్' ముందుకు సాగుతోంది.



# ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ విజయం

**ప్రజాతపన ,అమరావతి**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైకాపాకి గట్టి షాక్ తగిలింది. తెదేపా అభ్యర్థి పంచుమర్తి అనురాధ 23 ఓట్లతో ఘన విజయం సాధించారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, మొత్తం మూడు స్థానాలనూ గెలుచుకున్న తెదేపా మరోసారి తన సత్తా చాటినట్లయింది. మొత్తం ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. శాసనసభలో తనకున్న బలాన్నిబట్టి తెదేపా ఒక అభ్యర్థిని మాత్రమే పోటీకి నిలబెట్టింది.

మొత్తం 7 స్థానాలకు 8 మంది పోటీపడిన వేళ గెలుపెవరిది? అనే అంశం ఆసక్తి రేకెత్తించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో షాక్ తిన్న వైకాపా.. ఏడుకు ఏడు స్థానాలు కైవసం చేసుకోవాలని

(మిగతా 2లో)

# కల్పవృక్ష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి కటాక్షం

**ప్రజాతపన ,తిరుపతి**

తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రకృతికి శోభను సమకూర్చేది చెట్టు. అనేక విధాలైన

(మిగతా 2లో)



# పోలవరం ఫిబ్రవరి కే పూర్తవ్వాలి- కేంద్రమంత్రి



**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

పోలవరం ప్రాజెక్టు పై కేంద్రం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. తొలి దశలో పోలవరం ప్రస్తుతానికి 41.15 మీటర్లకే పరిమితమని స్పష్టం చేసింది. తొలిదశలో 41.15 మీటర్ల మేరకే పోలవరంలో నీటిని నిల్వ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. తొలిదశ సహాయ, పునరావాసం అంతవరకేనని తేల్చి చెప్పింది. వైసీపీ ఎంపీ సత్యవతి లోక్ సభ లో అడిగిన ప్రశ్నకు

(మిగతా 2లో)



# రాహుల్ గాంధీకి జైలు

### .బెయిల్ మంజూరు

### క్రిమినల్ డెఫమెషన్ కేసు నమోదు

**ప్రజాతపన ,గాంధీనగర్ :**

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా తేల్చింది సూరత్ కోర్టు. పరువునష్టంకేసులో రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధించింది కోర్టు. 2019లో మోడీ ఇంటిపేరుపై రాహుల్ వివాదాస్పద కామెంట్స్ చేశారు. దొంగలందరికీ మోదీ ఇంటి పేరేనంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తప్పేనని కోర్టు తేల్చి చెప్పింది. గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేష్ మోడీని ఉద్దేశించి రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్నాటకలోని కోలార్ సభలో రాహుల్ ఈ కామెంట్స్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై క్రిమినల్ డెఫమెషన్ కేసు నమోదు చేశారు. రాహుల్‌పై పరువునష్టం దావా కేసుని విచారించిన సూరత్ కోర్టు రాహుల్‌ని దోషిగా నిర్ధారించింది.అయితే ఈ కేసులో వెంటనే బెయిల్ కూడా మంజూరు చేసింది న్యాయస్థానం.

(మిగతా 2లో)

# రైతులకు కేసీఆర్ భరోసా



### ఎకరానికి 10 వేల పరిహారం అందచేత

**ప్రజాతపన ,హైదరాబాద్:**

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు భరోసా ఇచ్చి, ధైర్యం చెప్పేందు సీఎం కేసీఆర్ ఇవాల నాలుగు జిల్లాలో పర్యటించనున్న విషయం తెలిసిందే. రైతులకు అండగా వుండి ప్రభుత్వం పరిహారం ఇస్తుందని అధైర్య పడకూదని సీఎం కేసీఆర్ రైతులతో స్వయంగా మాట్లాడుతూ ముందుగా ఖమ్మం జిల్లాలో పర్యటించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. నష్టపరిహారం ఎకరానికి 10 వేల చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఖమ్మం జిల్లాలోని బోనకల్ మండలంలో నష్టపోయిన పంట పొలాలను సీఎం కేసీఆర్ పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. రైతులతో పాటు కౌలు రైతులను కూడా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సహాయాన్ని తక్షణమే రైతులకు అందజేస్తామని స్పష్టం చేశారు. నిజానికి రైతులకు ఇచ్చే దాన్ని నష్టపరిహారం అనరని, సహాయ పునరావాస చర్యలు అని అంటారని చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో ఉచిత కరెంట్, ఉచిత నీళ్లు, వాటర్ సెస్ బకాయి రద్దు చేసి రైతులను ఆదుకుంటే వ్యవసాయం బాగుపడుతుందని అన్నారు. కావున ఆ స్థితిని దెబ్బతీయనివ్వకూడదు కాబట్టి ఈ రంగాన్ని నిర్వీర్యం కానివ్వమన్నారు సీఎం. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు నిరాశపడొద్దు. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నష్టపరిహారం అనేది ప్రపంచంలో ఎవరూ ఇయ్యలేరని, రైతులు మళ్లీ పుంజుకుని, వ్యవసాయం చేసేందుకు వీలుగా సహాయసహకారాలు అందించాలని సీఎం కేసీఆర్ కోరారు. అందువల్లే ఎకరానికి 10వేలు ఇండియాలో తొలిసారిగా

(మిగతా 2లో)

ప్రజాతపన prajathapana.com News that matters

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ విజయం

(మొదటిపేజీ తరువాయి)

పంతం పట్టింది. ఒక్క ఎమ్మెల్యే కూడా చేజారకుండా జాగ్రత్త పడింది. ఈ పరిస్థితుల్లో తీవ్ర ఉత్కంఠ మధ్య పోలింగ్ జరగ్గా తెదేపా గెలిచింది. ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీలను కోల్పోయిన వైకాపాకు ఇది మరో గట్టిషాక్‌గా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఐదుగురు వైకాపా అభ్యర్థులు, ఒక తెదేపా అభ్యర్థి విజయం సాధించారు. వైకాపా అభ్యర్థుల్లో సూర్యనారాయణ రాజు, పోతుల సునీత, బొమ్మి ఇశ్రాయేలు, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్ విజయం సాధించారు. ఏడో స్థానం కోసం కోలా గురువులు, జయమంగళ మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. దీంతో ఈ ఇద్దరి మధ్య రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. రెండో ప్రాధాన్యత ఓట్లలో కోలా గురువులు విజయం సాధించారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా వ్యూహం ఫలించింది. అభ్యర్థిని బరిలోకి దించి అధికార పార్టీ ఏకగ్రీవ ఆశలకు గండికొట్టి.. అభ్యర్థిని గెలిపించుకుంది. మొత్తం 7 స్థానాలకు ఇవాళ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. 175 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, మొత్తం మూడు స్థానాలనూ గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ... అదే ఉత్సాహంతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలపైనా దృష్టి పెట్టింది. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు, తెదేపా టికెట్‌పై గెలిచి, ఆ తర్వాత వైకాపాలో చేరిన నలుగురు ఎమ్మెల్యేలకు కూడా పార్టీ విప్ జారీ చేసింది. ఓటు వేయడంలో ఎక్కడా పొరపాటు జరగకుండా ఇప్పటికే రెండు, మూడు దఫాలు నమూనా పోలింగ్ నిర్వహించింది. తెదేపా అధినేత చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తూ వచ్చారు.

తెదేపా అభ్యర్థి గెలవాలంటే 22 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయాలి. తెదేపా బిఫారంపై గెలిచిన 23 మంది ఎమ్మెల్యేల్లో... కరణం బలరామకృష్ణమూర్తి, మద్దాలి గిరిధర్, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్‌కుమార్ వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో ప్రస్తుతం శాసనసభలో తెదేపా బలం 19కి తగ్గింది. ఆ నలుగురూ సాంకేతికంగా తెదేపా సభ్యుల కిందే లెక్క. కాబట్టి వారికి కూడా తెదేపా విప్ జారీ చేసింది. ఆ నలుగురు ఎమ్మెల్యేల నుంచి గానీ, వైకాపా అసంతృప్త ఎమ్మెల్యేల నుంచి గానీ.. ముగ్గురు తెదేపా అభ్యర్థికి ఓటు వేస్తే అనురాధ ఎమ్మెల్సీగా గెలిచే అవకాశముంటుందని భావించింది. అయితే, చివరి వరకూ ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో పంచుమర్తి అనురాధ విజయం సాధించి, అధికార వైకాపాకు షాక్ ఇచ్చారు. అయితే ఆమెకు అనుకూలంగా ఓటు వేసిన ఆనలుగురు ఎవరు అనేది చర్చనీయాంశంగా మారింది.

# కల్పవృక్ష వాహనంపై

# శ్రీరామచంద్రమూర్తి కటాక్షం

(మొదటిపేజీ తరువాయి)

వృక్షాలు సృష్టిలో ఉన్నాయి. అందులో మేటి కల్పవృక్షం. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని స్వామివారు అధిరోహించారు. అనంతరం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, కొబ్బరినీళ్లు, చందనంలతో అభిషేకం చేశారు.

వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, కంకణబట్టార్ ఆనందకుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పోలవరం ఫిబ్రవరి కే పూర్తవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

సమాధానంగా కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. తొలిదశ సహాయ, పునరావాసం ఫిబ్రవరి 2023కే పూర్తి కావాల్సి ఉందని, తొలిదశలో 20,946 నిర్వాసిత కుటుంబాలకు సహాయ, పునరావాసం ఫిబ్రవరి 2023 నాటికే ఇవ్వాల్సి ఉందని.. దానిని కూడా ఇప్పటి వరకు పూర్తి చేయలేదని ప్రహ్లాద్ సింగ్ పటేల్ అన్నారు. కేవలం 11,677 నిర్వాసిత కుటుంబాలకే సహాయ, పునరావాసం ఏపీ ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. మిగతావారికి సహాయ, పునరావాసం మార్చి 2023 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇంతవరకు చేయలేదని ప్రహ్లాద్ సింగ్ పటేల్ పేర్కొన్నారు. నిజానికి పోలవరంలో మొదటి దశ.. రెండో దశ అనేది లేదు. అయితే ఆర్థిక సమస్యల కారణం ఎత్తు తగ్గించే ఆలోచనలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. సీఎం జగన్ కూడా పలుమార్లు తొలి దశ ప్రస్తావన చేశారు. తొలి దశలో 41.15 మీటర్ల వరకే నీటి నింపడం .. ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బ తినకుండా ఎంత ఎత్తు తగ్గిస్తే ఎంత ముంపును నివారించడానికి అవకాశం ఉందన్న అంశంపై కేంద్ర జల సంఘం ,పోలవరం ప్రాజెక్టు అథారిటీ తదితర సంస్థలను సంప్రదిస్తున్నట్లుగా ప్రచారం జరిగింది. నీటి మట్టాన్ని తగ్గించటం వల్ల ముంపుతో పాటు నిర్మాణ వ్యయాన్ని నియంత్రించవచ్చు అని భావిస్తున్నారు. ప్రధానంగా పోలవరం నీటి సామర్థ్యం , దానిని ఎంతకు తగ్గించాలి , ఎత్తు ఏ మేరకు తగ్గించాలి , అలా తగ్గిస్తే ఎంత వ్యయాన్ని నియంత్రించవచ్చు , ఏ మేరకు ముంపును తగ్గించవచ్చు అనే అంశాలపై ఇప్పటికే ఓ నిర్మయానికి వచ్చారని అంటున్నారు. అయితే



ఎత్తు తగ్గించడం కన్నా.. మొదటి దశలో నీటి నిల్వను పరిమితం చేయడం మంచిదని అంచనాకు వచ్చినట్లుగా తాజా ప్రకటనతో కొంత మంది అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు మొత్తం 1,13,119 ఎకరాల భూమిని సేకరించారు. పోలవరం నిర్మాణంలో భూసేకరణ వ్యయం ఎక్కువగా వున్నందున రెండు దశల్లో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రెండు దశల్లో కలిపి మొత్తం 45.72 మీటర్ల ఎత్తు పూర్తి చేస్తామని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇలా ఎత్తు తగ్గించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని.. పలువురు విమర్శిస్తున్నారు. ఇటీవల ఏపీ సీఎం జగన్‌కు లేఖ రాసిన మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు పోలవరం పూర్తి రిజర్వాయర్ లెవల్ ను 150 అడుగుల నుంచి 140 అడుగులకు తగ్గిస్తే ప్రాజెక్టు నుంచి ఆశించిన ప్రయోజనాలు అందడం అసాధ్యం అని కేంద్ర జల సంఘం ఎప్పుడో చెప్పిందని గుర్తు చేశారు. పోలవరం రిజర్వాయర్ లెవల్ 140 అడుగులు మరియు 150 అడుగుల మధ్య కాంటూర్ లో సహాయ పునరావాస కార్యక్రమాలకు 30 వేల కోట్లు అవసరమవుతాయి. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా పోలవరం జాతీయ ప్రాజెక్టును ఫుల్ రిజర్వాయర్ లెవల్ 150 అడుగుల మేరకు రాష్ట్రంపై భారం లేకుండా పూర్తి కేంద్ర నిధులతో త్వరితగతిన నిర్మించి పూర్తి చేయాలని ఏపీలో విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# రాహుల్ గాంధీకి రెండేళ్లు జైలు

(మొదటిపేజీ తరువాయి)

దొంగలందరికీ మోదీ ఇంటి పేరేనంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తప్పేనని కోర్టు తేల్చి చెప్పింది. గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేష్ మోడీని ఉద్దేశించి రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ.. దొంగలందరూ మోదీ ఇంటిపేరుతోనే ఉన్నారెందుకు? అంటూ వ్యాఖ్యానించారు రాహుల్ గాంధీ. కర్ణాటకలోని కోలార్‌లో ఓ ఎన్నికల సభలో రాహుల్ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో పరువు నష్టం కేసును దాఖలు చేశారు బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ. గత శుక్రవారం విచారణ ముగించి తీర్పును రిజర్వు చేసిన సూరత్ న్యాయస్థానం.సార్వత్రిక ఎన్నికలకు ముందు కర్ణాటకలోని కోలార్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వయనాడ్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ ఇంటిపేరుపై వ్యాఖ్యానించినప్పుడు ఈ కేసు 2019కి సంబంధించినది. ఆ తర్వాత అతనిపై పరువు నష్టం కేసు నమోదైంది. 'దొంగలందరికీ మోదీ ఇంటిపేరు ఒక్కటే ఎందుకు?' అని రాహుల్ కామెంట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎమ్మెల్యే, గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేష్ మోడీ పిటిషన్ దాఖలు చేశారు.2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్నాటకలోని కోలార్ సభలో రాహుల్ ఈ కామెంట్స్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై క్రిమినల్ డెఫమెషన్ కేసు నమోదు చేశారు. రాహుల్‌పై పరువునష్టం దావా కేసుని విచారించిన సూరత్ కోర్టు రాహుల్‌ని దోషిగా నిర్ధారించింది.రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించడం వల్ల ఆయన సభ్యత్వానికి ముప్పు ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో రెండేళ్ల శిక్షను కూడా ప్రకటించవచ్చు. అయితే కోర్టులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'నా ప్రకటన వల్ల ఎవరికీ నష్టం జరగలేదు. శిక్షను తగ్గించాలని కోర్టును ఆశ్రయించాను. మరోవైపు, అశ్విని చౌబే మాట్లాడుతూ, 'రాహుల్ గాంధీ కోర్టు పరిధిలో ఉన్నారు. అతను కూడా ప్రజాస్వామ్యంలో ఉన్నారు. పార్లమెంట్‌కు వచ్చి క్షమాపణ చెప్పే ధైర్యం కూడా చేయలేదు. రాహుల్ గాంధీపై ఐపీసీ సెక్షన్ 499, 500 కింద నేరం నమోదు చేశారు. ఈ కేసులో ఇవాళ మూడోసారి కోర్టుకు హాజరయ్యారు. చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్‌హెచ్ వర్మ కోర్టు గత వారం ఇరుపక్షాల వాదనలు విని మార్చి 23న తీర్పును ప్రకటించాలని నిర్ణయించింది. ఈరోజు విచారణ అనంతరం రాహుల్ గాంధీని దోషిగా కోర్టు తేల్చింది.

## షాక్ లో ఉన్నానన్న రేవంత్

ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ గారికి సూరత్ కోర్ట్ 2 ఏళ్ల జైల్ శిక్ష విధించడం షాక్ కు గురిచేసిందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో, రాష్ట్రంలో అక్కడ బీజేపీ.. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయని మండిపడ్డారు. టీఎస్పీఎస్సిలో జరిగిన పేపర్ లీక్ ల కుంభకోణంలో నేను సాక్షిగా వెళుతున్న సమయంలో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను, హౌస్ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. కేసీఆర్ ఖమ్మం, మహబూబా బాద్ జిల్లాలలో పర్యటించి పాడైన పంటలను పరిశీలించేందుకు వెళ్తుంటే ఆయా జిల్లాల నాయకులను అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో, రాష్ట్రంలో ఇంతటి నిర్బంధం ఏమిటి? అని ప్రశ్నించారు. మనం ఎక్కడ ఉన్నాం.. ఇంతటి నియంత పాలనను ఎంతకాలం భరిద్దామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు లేకుండా పాలన సాగుతున్న బీజేపీ, బీఆర్ఎస్ లపై తిరగబడక తప్పదన్నారు. రాహుల్ గాంధీ 2019 పార్లమెంట్ ఎన్నికల సభలో మాట్లాడిన ఒక రాజకీయ ప్రకటన ను ఆసరా చేసుకొని మోడీ ప్రభుత్వం ఆయనపై పరువు నష్టమ్ దావా వేసి కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీ కుటుంభం ఇలాంటి వాటికి భయపడదన్నారు.సంపన్న కుటుంబం, విలాసవంతమైన జీవితాన్ని పక్కన పెట్టి దేశం కోసం బ్రిటిష్ పైన పోరాటం చేసి ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గి దేశానికి స్వేచ్ఛ తెచ్చిన కుటుంభం.. ఈ మోడీ లకు భయపడదని అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ తాత నెహ్రు పోరాటం చేసి జైల్ కు నాయనమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం దేహాన్ని ముక్కులు చేసిన భయపడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి రాహుల్ గాంధీ మోడీ బెదిరింపులకు భయపడదన్నారు. రాహుల్ గాంధీకి పరువు నష్టం కేసులో సూరత్ కోర్ట్ వేసిన రెండేళ్ల శిక్షపైన ఉన్నత కోర్టులకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామన్నారు. దేశం కోసం, ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారు.

# రైతులకు కేసీఆర్ భరోసా



(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తున్నానని సీఎం అన్నారు. దీనిని వెంటనే అందజేస్తామని, స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కౌలు రైతులను కూడా ఆదుకుంటామన్నారు. ఇలా ఇచ్చే డబ్బు నేరుగా రైతులకు ఇవ్వకుండా వాళ్లను పిలిపించి కౌలు రైతులను కూడా ఆదుకునేలా ఆదేశాలిస్తామన్నారు. ఇక..ఎట్టి పరిస్థితుల్లో నిరాశపడొద్దని, జరిగిన నష్టానికి ఏ మాత్రం చింతించకుండా రైతులు భవిష్యత్తులో ఉన్నతమైన పంటలను పండించే ఆలోచనతో ముందుకు పోవాలన్నారు. రైతులు ఎట్టిపరిస్థితుల్లో ధైర్యాన్ని వీడొద్దని రైతన్నలకు భరోసా నింపారు సీఎం కేసీఆర్.

ఇటీవల కురిసిన వడగళ్ల వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సీఎం కేసీఆర్ పర్యటిస్తున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆయన ఖమ్మం జిల్లాలోని బోనకల్ మండలానికి మొదట వెళ్లారు. అక్కడ రావినూతల గ్రామానికి చేరుకొని వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముందుగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. ఆ తర్వాత రావినూతల పంట పొలాల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి పంట పొలాల వద్ద రైతులను, స్థానిక వ్యవసాయ అధికారులను కలుసుకున్నారు. పంట నష్టం గురించి అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు? ఎంత పెట్టుబడి పెట్టారనే వివరాలు అడగి తెలుసుకున్నారు. అనంతరం గార్లపాడు మార్గంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు.

## కౌలు రైతులనూ ఆదుకుంటాం

ఈ ప్రాంతంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని అన్నారు. సొంత పొలాన్ని పండించుకొనే రైతులను ఆదుకోవడమే కాకుండా, కౌలు రైతులను కూడా తప్పకుండా ఆదుకుంటామని చెప్పారు. రైతులు నిరాశకు గురి కావొద్దని ధైర్యం చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఈ నిధులను గంటలోనే విడుదల చేస్తామని తెలిపారు. గాలి వాన వల్ల మొత్తం 2,22,250 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఎంత చెప్పినా చెవుటోని ముందు శంఖం ఊదినట్లే ఉందని విమర్శించారు. దీంతో ఈసారి పంట నష్టంపై కేంద్రానికి ఎలాంటి నివేదిక పంపదల్చుకోవడం లేదని అన్నారు. ఒకవేళ తాము పంపినా కేంద్రం నుండి ఎలాంటి నిధులు రాబోవని అన్నారు. కేంద్రానికి చెప్పినా గోడకు చెప్పినా ఒక్కటేనని ఎద్దేవా చేశారు. దేశానికి నూతన వ్యవసాయ విధానం అవసరం ఉందని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, రైతుబంధు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో పర్యటన అనంతరం మహబూబాబాద్ జిల్లాకు సీఎం కేసీఆర్ వెళ్లనున్నారు.కరీంనగర్ జిల్లాలో రామడుగు, చొప్పదండి, గంగాధర మండలాల్లో నేడు సీఎం కేసీఆర్ పర్యటిస్తారు. బాధిత రైతులను ఓదార్చనున్నారు. బుధవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు తదితర అధికారులు సీఎం పర్యటించే గ్రామాలను ముందస్తుగానే పరిశీలించారు. రామడుగులోని గాయత్రీ పంప్‌హౌస్ వద్ద ఉన్న హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేయగా, అక్కడ కూడా పరిశీలించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 23,116 ఎకరాల్లో పంట నష్టం ఏర్పడినట్లుగా అంచనా.మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర మండలం రెడ్డికుంట తండాలో నేడు మధ్యాహ్నం సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. వడగళ్ల వానతో ఇక్కడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటలను పరిశీలించి రైతుల్లో మనోధైర్యం కల్పించేందుకు సీఎం కేసీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించనున్నారు.వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురంతో పాటు పరిసర గ్రామాల్లో వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్ పరిశీలించనున్నారు. ఈ పర్యటన కోసం అడవిరంగాపురంలో హెలీప్యాడ్ సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి అన్ని ఏర్పాట్లు చేయించారు.

# ఐపీఎల్ లో కొత్త నిబంధనలు...

**ముంబై:**

మూడు వారాలుగా క్రికెట్ ప్రేమికులకు అలరిస్తున్న ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తుది అంకానికి చేరింది. ఈ లీగ్ లో ఇక మిగిలింది రెండు మ్యాచ్ లు మాత్రమే. డబ్ల్యూపీఎల్ ముగిసిన వెంటనే భారత క్రికెట్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) - 16 వ సీజన్ మొదలుకాబోతుంది. మార్చి 31 నుంచి ఈ లీగ్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే సీజన్ నుంచి ఐపీఎల్ లో పలు కీలక నిబంధనలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకురాబోతుంది. బ్యాటర్లకు అనుకూలించే ఫీల్డింగ్ మార్పులు, పవర్ ప్లే, రెండు డీఆర్ఎస్ లు.. ఇలా ప్రతీ సీజన్ ఏదో కొత్త నిబంధనతో వస్తూ క్రికెట్ ను మరింత వినోదభరితమైన ఆటగా మారుస్తున్న బీసీసీఐ.. ఈ సీజన్ లో కూడా అటువంటి నిబంధనలను మరికొన్నింటినీ తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ఇప్పటివరకు టాస్ వేయడానికంటే ముందే రెండు జట్లూ ఆ మ్యాచ్ లో ఆడబోయే తుద జట్ల వివరాలను ప్రత్యర్థి సారథులకు, రిఫరీకి అందజేయాలి. ఒక్కసారి ప్రత్యర్థి సారథికి షీట్ అందజేశాక మళ్లీ దానిలో మార్పులు చేయడానికి ఉండదు. కానీ కొత్త నిబంధన ప్రకారం టాస్ వేశాక కూడా తుది జట్లను మార్చుకోవచ్చు. టాస్ గెలుపోటములను నిర్ణయించడంలో కీలకభూమిక పోషిస్తున్న నేపథ్యంలో తమ అత్యుత్తమ జట్టును ఎంచుకునేందుకు అవకాశముంటుంది. టాస్ వేశాక 15 మందితో కూడిన టీమ్ షీట్ ను అందించాలి. ఇందులో తుది జట్టులో ఆడే 11 మందితో పాటు నలుగురు సబ్‌స్టిట్యూట్ (ఇంపాక్ట్ ప్లేయర్ తో కలుపుకుని) లు ఉంటారు. ఈ నిబంధన ముఖ్యంగా ఈ సీజన్ నుంచి కొత్తగా అమల్లోకి రాబోతున్న 'ఇంపాక్ట్ ప్లేయర్' విషయంలో సాయపడుతుంది. ఉదాహరణకు గుజరాత్ టైటాన్స్ జట్టు టాస్ గెలిచినా, ఓడినా.. తమ టీమ్ వివరాలను వెల్లడించిన తర్వాత కూడా మ్యాచ్ ప్రారంభానికి ముందు తుది జట్టులో మార్పులు చేసుకోవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో రాహుల్ తెవాటియాను తీసుకోవచ్చు. ఈ మార్పు చేశామని ప్రత్యర్థి టీమ్ సారథికి చెప్పల్సిన అవసరం లేదు. ఈ నిబంధనను ఈ ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరిగిన ఎస్ఎ 20 లీగ్ లో అమలుచేశారు. - ఓవర్ రేట్ పెనాల్టీ పడితే 30 యార్డ్స్ సర్కిల్ లో నలుగురు ఫీల్డర్లే ఉంటారు. అంటే ఒక బౌలర్ కు కేటాయించిన నిర్దిష్ట సమయంలో అతడు ఓవర్ ను పూర్తి చేయాలి. లేకుంటే పెనాల్టీ పడుతుంది. - ఫీల్డర్ లేదా వికెట్ కీపర్ ఏదైనా తిక్క చేష్టలకు పాల్పడితే బంతిని డెడ్ బాల్ గా ప్రకటించడంతో పాటు అపోజిషన్ టీమ్ కు ఐదు పరుగులు కూడా లభిస్తాయి. కాగా పై నిబంధనలలో చాలా మట్టుకు బ్యాటర్ ఫ్రెండ్లీ ఉన్నవే ఎక్కువ. గతేడాది ఐపీఎల్ లో పది జట్లు ఆడినా అనుకున్న స్థాయిలో విజయవంతం కాకపోవడంతో బీసీసీఐ ఈ లీగ్ కు కొత్త హంగుల (నిబంధనలు)ను అద్ది క్రేజ్ పెంచాలని యత్నిస్తున్నది. మరి ఇవి ఎంతమేరకు విజయం సాధిస్తాయన్నది త్వరలోనే తేలనుంది.

# గవర్నర్ సీరియస్ సంకేతాల అర్ధం ఏమిటీ...

**హైదరాబాద్ :**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పేపర్ల లీక్ కావడం ఇప్పుడు మరోసారి తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్ మధ్య రచ్చకు కారణమయ్యే అవకాశం కనిపిస్తోంది. పేపర్ లీక్ పరిణామాలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సీరియస్‌గా ఉన్నట్లు గవర్నర్ సంకేతాలు పంపుతున్నారు. టీఎస్‌పీఎస్సీ వ్యవహారం, విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు తనను ఆవేదనకు గురి చేస్తున్నాయని తనతో భేటీ కావడానికి వచ్చిన టీ-కాంగ్రెస్ నేతలతో చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీపై బుధవారం టీ కాంగ్రెస్ నేతలు గవర్నర్ కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారితో గవర్నర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలతో సిరిసిల్లలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి ఘటనను గవర్నర్ ప్రస్తావించారని, ప్రశ్నాపత్రాల లీకేజీపై ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లను పరిశీలిస్తున్నానని తన వరకు వచ్చిన ఫిర్యాదులుపై న్యాయనిపుణుల సలహా తీసుకుంటానని వారితో చెప్పారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని.. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నందున రాజ్యాంగానికి లోబడి బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని అందువల్లే లీగల్ ఒపీనియన్ ప్రకారం తన నిర్ణయం ఉంటుందని గవర్నర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ బోర్డును తప్పించే చర్యలు తీసుకుని విచారణ పారదర్శకంగా చేస్తారని భావించినప్పటికీ ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకోలేదని అందువల్ల విచారణ పూర్తి అయ్యే వరకు టీఎస్ పీఎస్సీని రద్దు చేసే విశేష అధికారం గవర్నర్‌కు ఉంటుందని రేవంత్ రెడ్డి గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై గవర్నర్ ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదని తెలుస్తోంది. టీఎస్ పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ చేస్తున్న విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసులో నిందితులను కస్టడీలోకి తీసుకున్న విచారిస్తోన్న సిట్.. తాజాగా టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తోన్న 42 మంది ఉద్యోగులకు నోటీసులు జారీ చేసింది. టీఎస్‌పీఎస్సీ ఔట్ సోర్సింగ్ ఐటీ సిబ్బందికి సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌లతో సన్నిహితంగా ఉన్నవారిపై సిట్ ఫోకస్ పెంచింది. ఇందులో భాగంగానే తాజాగా సిట్ పలువురు ఉద్యోగులు, అభ్యర్థులకు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే కమిషన్‌లో పనిచేస్తోన్న 10 మంది గ్రూప్ 1 పరీక్ష రాసినట్లు గుర్తించిన సిట్.. దర్యాప్తులో భాగంగా వారందరికి నోటీసులు పంపింది. అంతేకాకుండా కాన్ఫిడెన్షియల్ రూమ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న శంకరలక్ష్మి పాత్రపై మరింత దర్యాప్తు చేయాలని సిట్ నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కీలకంగా ఉన్న నిందితురాలు రేణుకతో టచ్‌లో ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకులు.. అభ్యర్థులను కూడా విచారించేందుకు సిట్ సిద్ధం అయ్యింది. అలాగే నిందితుడు రాజశేఖర్ స్నేహితుడు రమేష్ పాత్రపై మరోసారి సిట్ అధికారులు విచారణ చేయనున్నారు. మరో వైపు ఈ కేసులో రాజకీయంగా సంచలన ఆరోపణలను రాజకీయ పార్టీల నేతలు చేస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ టీఎస్?పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో ఎమ్మెల్సీ కవిత పాత్ర ఉందంటూ సంచలన ట్వీట్ చేశారు. ప్రస్తుతం టీఎస్?పీఎస్సీ మెంబర్ గా ఉన్న తనోబా ఒకప్పుడు తెలంగాణ జాగృతి మెదక్ జిల్లా అధ్యక్షురాలిగా పని చేశారని గుర్తు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లాగా ఎన్ని పోస్టులు ఎవరెవరికి అమ్ముడు పోయాయో అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అందుకే టీఎస్?పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. మొత్తంగా పేపర్ లీకేజీ అంశం ఊహించనంత మలుపులు తిరుగుతోంది. ఇప్పుడు గవర్నర్ కూడా జోక్యం చేసుకుంటే.. ఇక ఎలాంటి మలుపులు తిరుగుతుందో అంచనా వేయడం కష్టమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# నెల్లూరులో మాస్క్ మస్ట్...

**నెల్లూరు :**



నెల్లూరు జిల్లాలో మాస్క్ నిబంధన మళ్లీ తెరపైకి తెచ్చారు అధికారులు. ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సహా స్పందనకు వచ్చినవారందరూ మాస్క్ లు ధరించి కనిపించారు. మాస్క్ లేనిదే కలెక్టరేట్ లోకి ఎంట్రీ లేదన్నారు అధికారులు. కచ్చితంగా మాస్క్ ధరించి రావాలని చెప్పారు. జిల్లాలో వైరల్ ఫీవర్లు పెరగడం, ఫ్లూ లక్షణాలతో కొంతమంది ఆస్పత్రుల్లో చేరడంతో కలెక్టర్ చక్రధర్ బాబు కఠిన నిబంధనలు తీసుకొచ్చారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్ సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన స్పందన కార్యక్రమాల్లో అధికారులంతా మాస్క్ లతో కనిపించారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా మాస్క్ లు ధరించి వచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటైజర్ల వినియోగం కూడా పెరిగింది. కరోనా భయం తగ్గినట్టే తగ్గి మళ్లీ మొదలైంది. తెలుగు రాష్ట్రాల్లో ఫ్లూ జ్వరాల బాధితులు ఎక్కువయ్యారు. ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా పెరిగింది. ఊ3ఔ2 వైరస్ కూడా అక్కడక్కడా బయటపడుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తత ప్రకటించింది. ఇటు రాష్ట్రంలో కూడా ఫీవర్ సర్వే మొదలు పెట్టారు అధికారులు. ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కరోనా యాక్టివ్ కేసుల్లో పెద్దగా పెరుగుదల లేకపోయినా కొత్తగా వైరస్ బారిన పడుతున్నవారి సంఖ్య మాత్రం పెరుగుతోంది. దీంతో కేంద్రం కూడా మార్గదర్శకాలు విడుదల చేసింది. వైరల్ ఫీవర్లను తేలిగ్గా తీసుకోవద్దని ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకోవాలని సూచిస్తోంది. వైరల్ ఫీవర్లకు వాడాల్సిన మందుల వివరాలపై కూడా కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతానికి కరోనా కేసుల్లో భారీ పెరుగుదల లేకపోవడంతో ఆంక్షలు విధించే అవకాశాలు చాలా తక్కువ అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అలర్ట్ గా ఉంటున్నాయి. తమిళనాడులో కూడా మాస్క్ నిబంధన తెరపైకి తెచ్చారు. ఇటు ఏపీలో అన్ని జిల్లాల్లో మాస్క్ నిబంధన లేకపోయినా నెల్లూరు మాత్రం అలర్ట్ అయింది. తమిళనాడుకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో నెల్లూరు జిల్లాలో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు సూచనలతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. అవగాహనలో భాగంగా జిల్లాలో మాస్క్ నిబంధన తెరపైకి తెచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాల్సిందేనంటున్నారు. అయితే ఎక్కడా జరిమానాల ప్రస్తావన తేవడంలేదు. ప్రజలు కూడా స్వచ్ఛందంగానే మాస్క్ లు ధరించి బయటకు వస్తున్నారు. షాపింగ్ మాల్స్ లో కూడా మాస్క్ నిబంధన అమలు చేస్తున్నారు. జిల్లాలో ఫ్లూ లక్షణాలు లేవని, అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు డాక్టర్ ఎం. పెంచలయ్య. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని చెప్పారు. ప్రస్తుత సీజన్ లో జలుబు, దగ్గు వారం, పదిరోజుల ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయం అవుతుందన్నారు డిఎంహెచ్వో . వేసవిలో మజ్జిగ, నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అధికంగా తీసుకుంటూ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండబారిన పడకుండా ఉండాలన్నారు.

# గ్రీన్ కారిడార్ విస్తరణలో హెచ్ఎండీఏ

**హైదరాబాద్ :**



పచ్చదనం పరిమళాలు పట్టణాలకే పరిమితం కాకుండా జాతీయ రహదారుల వెంట విస్తరిస్తున్నది. మండు వేసవిలోనూ పచ్చదనంతో, పూలవనాలతో హైదరాబాద్ కు వచ్చే నేషనల్ హైవే మార్గాలు వచ్చిపోయేవారికి కంటికి ఇంపుగా, ఆనందాన్ని కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నగరానికి అనుసంధానంగా ఉన్న నేషనల్ హైవేలు స్టేట్ హైవేల సుందరీకరణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) కీలకపాత్రను పోషిస్తున్నది. ప్రజల మనోభావాలకు, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్న కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత 8 ఏళ్లుగా భవిష్యత్తుతరాలకు పర్యావరణ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రణాళికాబద్ధంగా విరివిగా పచ్చదనాన్ని పెంచి పోషిస్తున్నది. వరంగల్ నేషనల్ హైవే వెంట ప్రస్తుతం యాదగిరిగుట్ట, రాయగిరి క్రాస్ రోడ్స్ వరకు ఉన్న హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ(హెచ్ఎండిఏ) మల్టీలేయర్ ప్లాంటేషన్గ్రీనరీని జనగామ వరకు పొడిగించాలని సీఎం పురపాలక శాఖను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా గ్రీన్ కారిడార్ ను తలపించేలా పచ్చదనాన్ని పెంచి పోషించాలని సీఎం కేసీఆర్ నిర్దేశించారు. దీంతో హెచ్ఎండీఏ యుద్ధపాతిపదికన పనులను పూర్తి చేసింది. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు, వరంగల్ నేషనల్ హైవే వెంట జనగామ వరకు దాదాపు రూ.15.04 కోట్ల వ్యయంతో హెచ్ఎండిఏ రూపొందించిన మల్టీలేయర్ ప్లాంటేషన్ అందరినీ ఆకట్టుకుంటున్నది. ఇప్పటికే రూ.15.04 కోట్ల వ్యయంతో వరంగల్ హైవే వెంట 64 కిలోమీటర్లు, రూ.3.57 కోట్ల వ్యయంతో నాందేడ్ హైవేవెంట 33 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీలేయర్ ప్లాంటేషన్ పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం హైవే వెంట శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మహేశ్వరం వరకు 18 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీలేయర్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. కర్నూలు హైవే వెంట అరాంఘర్ నుంచి షాద్‌నగర్ వరకు 25 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీలేయర్ ప్లాంటేషన్ హెచ్ఎండీఏ నిర్వహించింది. రాజీవ్ రహదారి స్టేట్ హైవే వెంట శామీర్‌పేట నుంచి గజ్వేల్ వరకు దాదాపు 39 కిలోమీటర్ల మేరకు సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్ నిర్వహించింది. గ్రీనరీపై గతంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధ్యయనం చేసింది. ఇటీవల కేరళకు చెందిన అధికారులు వరంగల్ నేషనల్ హైవే గ్రీనరీని స్టడీ చేశారు. బెర్లిన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి చార్లెట్ఎడాలిన్ హ్యూమన్ జియోగ్రఫీ అనే అంశంపై హెచ్ఎండీఏ మల్టీలేయర్ ప్లాంటేషన్‌పై పరిశోధన చేశారు. నాందేడ్ నేషనల్ హైవే వెంట హెచ్ఎండీఏ మల్టీలేయర్ ప్లాంటేషన్ పచ్చటి తివాచీ పరిచింది. కంది క్రాస్ రోడ్స్ నుంచి రాంసాన్ పల్లె వరకు 32.77 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ 3.57 కోట్ల వ్యయంతో సెంట్రల్ మిడెన్, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు పూర్తయ్యాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసిన నేపథ్యంలో వరంగల్ నేషనల్ హైవే వెంట గ్రీనరీ పెంచాలని ప్రభుత్వం భావించింది. తొలిదశలో వరంగల్ హైవే గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులను రూ.5.5 కోట్ల అంచనాలతో దాదాపు 30 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి చేశారు. ఘట్కేసర్ నుంచి రాయగిరి వరకు నేషనల్ హైవే సెంట్రల్ మిడెన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులు పూర్తయ్యాయి. గ్రీనరీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో మల్టీలేయర్ ప్లాంటేషన్ వరంగల్ వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీనరీ బ్యూటిఫికేషన్ పూర్తి కావడంతో వరంగల్ రహదారి వెంట పచ్చని అందాలు కనువిందు చేస్తున్నాయి. యాదాద్రి రూట్లో హెచ్ఎండీఏ పెంచిన మల్టీలేయర్ ప్లాంటేషన్ నేషనల్ హైవే అథారిటీకి ఆదర్శంగా నిలిచింది.

# వామపక్షాల్లో కలవరం...

**హైదరాబాద్:**

సహజంగా వామపక్షాలకు అనుబంధ సంఘాలు బలంగా ఉంటాయి. కార్మిక సంఘం, ఉపాధ్యాయ సంఘాలు వంటివి ఆ పార్టీలకే దన్నుగా ఉంటాయి. తమ డిమాండ్ల సాధనకు గట్టిగా పోరాడతాయని భావించి కావచ్చు. సమస్యలపై తక్షణమే స్పందించారని కావచ్చు. పోరాటంలో తమకు అండగా నిలుస్తాయన్న కారణాలతోనే ఉపాధ్యాయ సంఘాలు వామపక్ష పార్టీలకు తోడుగా నిలుస్తాయి. ఆ బలంతోనే సాధారణ ఎన్నికల్లోనూ కొద్దోగొప్పో వామపక్ష పార్టీలు తమ ఉనికిని చాటుకుంటున్నాయి. దశాబ్దకాలంగా ఏపీలోనూ, ఐదేళ్ల నుంచి తెలంగాణలోనూ ఏపీ శాసనసభలో ప్రాతినిధ్యం లేదు. తాజాగా జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు రెండు తెలుగు రాష్ట్రాల్లో వామపక్షాలకు షాకిచ్చాయనే చెప్పాలి. తెలంగాణ ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించారు. ఇక్కడ వామపక్ష పార్టీలు పరాజయం పాలయ్యాయి. అందుకు ప్రధాన కారణం అధికార బీఆర్ఎస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలవడమే. తమ డిమాండ్లను మండలిలో వినిపించేందుకు కూడా వామపక్ష పార్టీలు వెనుకంజ వేస్తాయని భావించి ఆ అభ్యర్థి వైపు చూడను కూడా చూడలేదు. టీచర్లు తమ వాదనను బలంగా వినిపించాలంటే బీజేపీ అభ్యర్థి బెటర్ అని భావించారు. అందుకే ఆయన వైపు మొగ్గుచూపారు. మునుగోడు ఉప ఎన్నికల నుంచి వామపక్ష పార్టీలు అధికార పార్టీతో జట్టుకట్టాయి. వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తో కలసి నడిచేందుకు సిద్ధమయ్యాయి. ఇక బీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించిన తర్వాత బీజేపీకి వ్యతిరేకంగా వామపక్షాలు ఆ పార్టీ సరసన చేరాయి. వచ్చే ఎన్నికలకు కూడా బీఆర్ఎస్ తో కలసి పోటీ చేయాలని నిర్ణయించాయి. మరో వైపు టీచర్ల బదిలీలు, పదోన్నతుల వంటి సమస్యల విషయంలోనూ అధికార పార్టీకి వ్యతిరేకంగా ఎటువంటి ఆందోళనలు చేపట్టలేదు. అనుబంధ ఉపాధ్యాయ సంఘాలు సయితం మీడియా సమావేశాలకే పరిమితమవ్వడంతో టీచర్లు బీజేపీ మద్దతు పలికిన అభ్యర్థికి అండగా నిలిచారు. దీంతో గెలవాల్సిన స్థానంలోనూ వామపక్ష పార్టీ ఓటమి పాలయింది ఇక ఆంధ్రప్రదేశ్ దీనికి రివర్స్ లో పరిస్థితి కనిపించింది. అక్కడ టీచర్లకు మద్దతుగా అనేక పోరాటాలు చేసిన అనుబంధ సంఘలను కాదనుకుని అక్కడి ఉపాధ్యాయులు అధికార పార్టీవైపు మొగ్గు చూపాయి. పీడీఎఫ్ నుంచి పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం పార్టీ మద్దతిచ్చినా ఫలితం లేకుండా పోయింది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మద్దతు పలికిన టీడీపీ టీచర్స్ ఎమ్మెల్సీలో కూడా సహకరించాలని కోరినా ఉపాధ్యాయులు అధికార పార్టీవైపు మొగ్గు చూపారు. దీనికి కారణాలేంటన్న దానిపై వామపక్ష పార్టీలు లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. చట్టసభల్లోకి సులువుగా ప్రవేశించే అవకాశం చేజారిపోయింది.

# అంతంతమాత్రంగా మిషన్ భగీరథ నీళ్లు

**అదిలాబాద్ :**



గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి గడపకు తాగునీరు అందించాలనే ధృడసంకల్పంతో ముఖ్యమంత్రి మిషన్ భగీరథ అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. కానీ కొన్ని గ్రామాలలోని వాటర్ ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందంగా తయారయింది తలకొండపల్లి మండలంలోని మిషన్ భగీరథ నీళ్ల పరిస్థితి. దేమండలంలోని అన్ని కలుపుకొని మొత్తము 66 గ్రామాలు, గిరిజన తండాలతో కలిపి 32 గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఒక్కో మనిషికి 100 లీటర్ల చొప్పున ప్రతి కుటుంబానికి 300 నుండి 400 లీటర్ల నీరు అందించాలని స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. తలకొండపల్లి మండలంలోని అధికారుల లెక్కల ప్రకారం సుమారు 50 వేల జనాభాకు గాను 13963 ఆవాసాలకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లుగా ధ్రువీకరించారు. కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడంతో తాము ఏం పాపం చేశామని ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్ మండలంలోని కర్కల్పాడు గేటు సమీపంలో మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని కోట్లాది రూపాయల ఖర్చు పెట్టి నిర్మించారు. అక్కడినుండి ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల ,తలకొండపల్లి మండలాలలోని ప్రతి గ్రామానికి, తండాకు తాగునీరు ప్రతినిత్యం సరఫరా చేస్తుంటారు. మండలంలోని 40 గ్రామాలకు మాత్రమే త్రాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తూ, మిగతా గ్రామాలకు చాలి చాలని నీరు అందుతుందని ఆయా గ్రామాల సర్పంచులు మండల సర్వసభ్య సమావేశాలలో సైతం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముందు తమ గోడును చెప్పుకొని వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోవడంతో ఆయా పల్లెల్లోని ప్రజలందరూ వాటర్ ఫిల్టర్స్ వద్దకు క్యూ కట్టవలసిన పరిస్థితి దాపరించింది. ఆ వాటర్ ఫిల్టర్స్ యజమానులు ఇదే అదునుగా భావించి 20 లీటర్ల బాటిల్ నీళ్లకు 10 నుండి15 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. నిజంగా అవి ఏ మేరకు ఫిల్టర్ చేస్తున్నారు? ఫ్లోరిన్ ఎంత పర్సంటేజీ వాటర్ లో ఉంది? అని తనిఖీ చేసేందుకు అధికారులు పత్తాలేరు. ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పెరిగిపోతున్నాయి. మండలంలోని అంతారం, చంద్రధన, లింగరావుపల్లి, హర్యానాయక్ తండ, సూర్య నాయక్ తండ, మాదాయపల్లి, మెదక్ పల్లి, తుమ్మల కుంట తండా, వీరన్నపల్లి, వెంకటాపూర్ గ్రామాలతో పాటు మరికొన్ని గిరిజన తండాలు, గ్రామాలకు కూడా చాలీచాలని నీరు అందుతుందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో సైతం ఎమ్మెల్యే ముందు తమ గోడును చెప్పుకొని గతంలో ఆవేదనను వ్యక్తం చేశారుగ్రామాలకు సరిపడా నీళ్లు రాకపోవడంతో ఏమీ చేయలేక గ్రామపంచాయతీ మోటార్ల ద్వారా రెండు నీళ్లు మిక్స్ చేసిన వాటర్ ను పంచాయితీ వాళ్లు ట్యాంకుల ద్వారా ట్యాప్ లోకి వదలడంతో కల్తీ నీరు త్రాగి చాలామంది వృద్ధులు, మహిళలు,చిన్నారులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి పెట్టి వెంటనే అన్ని గ్రామాలకు సమపాలల్లో మిషన్ భగీరథ నీళ్లు అందించే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచులు అధికారులను కోరుతున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్డు డిఈ సందీప్ ను దిశ వివరణ కోరగా మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే నీరు సరిపడా వెళ్లడం లేదని, మిగతా అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో వెళుతుంది. ఎక్కడైనా లోపం ఉంటే వెంటనే సరి చేస్తామని వివరణ ఇచ్చారు. సంబంధిత ఏఈ లీవ్ లో ఉన్నారని వివరణ ఇచ్చారు.

# ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినిలకు అస్వస్థత

**హైదరాబాద్**



రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం నాడు ఇద్దరు విద్యార్థినిలకు పరీక్షాహాలు లో అస్వస్థతకు గురయ్యారు. ఏపీ ప్రకాశం జిల్లా మార్కాపురం లోని సాధన జూనియర్ కాలేజీ లో పరీక్ష రాస్తుండగా ఇంటర్ విద్యార్థినికి అస్వస్థత గురి కావడంతో బందోబస్తులో ఉన్న సీఐ బీమా నాయక్ ఆ విద్యార్థిని స్వయంగా తన వాహనంలో ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం తెలిపారు. మరో ఘటనలో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఇంటర్ పరీక్షా కేంద్రంలోనే విద్యార్థిని బిందు గుండెపోటుకు గురయింది. దీంతో విద్యార్థినిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని బిందు ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం.

## కాకతీయ కెనాల్ లో అన్నదమ్ములు గల్లంతు

**హన్మకొండ**



హన్మకొండ నగరంలోని కొత్తపల్లికి చెందిన అన్నదమ్ములు ఇద్దరు కాకతీయ కెనాల్ లో గల్లంతు అయ్యారు. గల్లంతైన హర్షిత్, అన్విక్ కోసం గాలింపు గురువారం ఉదయం కుడా కొనసాగింది. మృతులు మట్టెడ కళ్యాణి-నరేష్ దంపతు ల కుమారులు. ఉగాది పర్వదినం సందర్భంగా కెనాల్ లో ఈతకు వెళ్లి గల్లంతయ్యారు.

## అదుపుతప్పిన కారు..ఇద్దరు అక్కడికక్కడేమృతి

**విశాఖపట్నం**

విశాఖపట్నం జిల్లా భీమిలి వలంద పేట జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక వ్యాగనార్ కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిద్ర మత్తులో వుండడంతో కారు డివైడర్ ను ఢీకొని తరువాత ఒక బస్సును ఒక లారీ ని ఢీకొంది. ఘటనలో కారు లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు శ్రీకాకుళం జిల్లా కు చెందిన లాడే దుర్గాప్రసాద్,పట్నాల సంతోష్ గా గుర్తించారు. మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. భీమిలీ పోలీసులు కేసు నమోదు చేసారు.

## మహిళా కాంగ్రెస్ నేత సునీతారావు అరెస్టు

**హైదరాబాద్**

గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ను పోలీసులు గృహనిర్బంధం చేసారు. బయటకు వచ్చిన ఆమెను మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సునీతా రావు మాట్లాడుతూ ప్రజా స్వామ్యం లో మాట్లాడకుండా గొంతు నొక్కేయడం మంచి పద్ధతి కాదు. ప్రతిపక్షాలను బయటికి రాకుండా గృహనిర్బంధం చేయడం సిగ్గుచేటని అన్నారు. సీఎం కేసీఆర్ కేటీఆర్ కు గుణపాఠం తప్పకుండా చెప్పి తీరుతామని అన్నారు. ఈరోజు వెళ్లకుంటే రేపు వెళ్తాం మళ్ళీ మళ్ళీ వెళ్తామని దుయ్యబట్టారు.

## రాహుల్ సిప్లి గంజ్ కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తలసాని

**హైదరాబాద్**

ఆస్కార్ అవార్డ్ పొందిన ఆర్ ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు పాట పాడిన రాహుల్ సిప్లిగంజ్ ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆస్కార్ అవార్డ్ పొందిన తర్వాత నగరానికి వచ్చిన రాహుల్ సిప్లిగంజ్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాహుల్ కు శాలువా కప్పి శుభాకాంక్షలు మంత్రి చెప్పారు. ఆస్కార్ అవార్డ్ పొందిన మొట్టమొదటి తెలుగుచిత్రం ఆర్ఆర్ఆర్. విశ్వవేదిక పై తెలుగువారి సత్తా చాటిన చిత్రం ఆర్ఆర్ఆర్ అని మంత్రి అన్నారు.

## కాంగ్రెస్ నేతల అరెస్టులను ఖండించిన టీపీసీసీ

**హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని టీపీసీసీ నేతలు ఖండించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగ యువత కి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుంది. అసలైన నిందితులను వొదిలేసి ప్రతిపక్షాల మీద పడటం కరెక్ట్ కాదని అన్నారు. న్యాయం జరిగేవరకు పోరాడుతాం . అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి మట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన లేదు. పోలీసు పాలన సాగుతోంది. పీసీసీ అధ్యక్షులు ఈ రోజు సిట్ కు హాజరవుతున్న నేపథ్యంలో నాతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టులు చేశారని ఆరోపించారు. పోలీస్ లు హౌస్ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వారందరినీ వెంటనే విడుదల చేయాలని అన్నారు.

## భవాని ఐలాండ్ లో తప్పిన ప్రమాదం

**విజయవాడ**

భవాని ఐలాండ్ లో ప్రమాదం తప్పింది. బంపర్ రైడ్ కు వెళ్లిన ఇద్దరు యువకులు నదిలో పడిపోయారు. వేగంగా వెళ్తున్న బంపర్ ఒక్కసారిగా అదుపుతప్పి నదిలో పడిపోయారు. అదృష్టవశాత్తు వారిద్దరు లైఫ్ జాకెట్స్ వేసుకోవడంతో ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించిన సిబ్బంది యువకులను రక్షించి బంపర్ బోట్ ను ఒడ్డుకు తరలించారు.

## ప్రభుత్వ పాఠశాలను కూల్చివేసిన అధికారులు

**సికింద్రాబాద్**

సీతాఫల మండి ప్రభుత్వ స్కూల్ ను అధికారులు కూల్చి వేసారు. నూతన భవన నిర్మాణం కోసం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలకు పాల్పడడంతో పలువురు తప్పు పడుతున్నారు. పరీక్ష సమయంలో భవనం కూల్చివేత పై టీచర్లు మండిపడుతున్ఆరు. చెట్ల కింద పిల్లల్ని కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. గతి లేక ఎండలో చెట్టు కింద కూర్చొని పిల్లు చదువుకుంటున్నారు.

# ఆర్ 5 జోన్ ఏర్పాటుపై వివాదం

**విజయవాడ :**

అమరావతి విషయంలో ఏపీ ప్రభుత్వం కోర్టులనూ లెక్క చేయడంలేదన్న విమర్శలు తాజాగా ఆర్ 5 జోన్ ఏర్పాటు విషయం లో వస్తున్నాయి. హైకోర్టు, రాజధాని ప్రాంత రైతుల అభ్యంతరాలు చెప్పినప్పటికీ అమరావతిలో స్థానికేత రులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం గెజిట్? నోటిఫికేసన్? విడుదల చేసింది. విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే సీఆర్‌డీఏ చట్ట సవరణ చేసింది ప్రభుత్వం. తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయ పాలెం, నిడమర్రు, కురగల్లు గ్రామాల పరిధిలో 900.97 ఎకరాల మేర పేదల ఇళ్ల కోసం జోనింగ్ చేస్తున్నట్టు ప్రకటించింది.ఎంపిక చేసిన భూముల ప్రాంతాన్ని ఆర్-5 జోన్‌గా పేర్కొంటూ గెజిట్? నోటిఫికేషన్? జారీ చేసింది. అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌లో కూడా ఈ మేరకు మార్పులు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఆర్-5 జోన్‌పై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించటానికి 15 రోజుల గడువు ఇచ్చింది. దీనిపై కొంతమంది హైకోర్టుకు వెళ్లారు. అంతకు ముందే ప్రభుత్వ చర్యలను హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రాజధాని నిర్మాణం కోసం తీసుకున్న భూముల విషయంలో రైతులకు ఇచ్చిన హామీలకు, చేసుకున్న ఒప్పందాలకు భిన్నంగా వెళ్లటం తగదని, ఈ రకమైన చర్యలు చెల్లవని పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది.గతంలో సీఆర్డీఏ చట్టంలో నాలుగు జోన్లు మాత్రమే ఉన్నాయి. ఆర్-1 అంటే.. ప్రస్తుత గ్రామాలు, ఆర్-2 అంటే తక్కువ సాంద్రత గృహాలు , ఆర్-3 అంటే తక్కువ నుంచి మధ్యస్థాయి సాంద్రత కలిగిన గృహాలు, ఆర్-4 అంటే హైడెన్సిటీ జోన్ పేర్లతో 4 రకాల నివాస జోన్ ఉండేవి. వీటికి అదనంగా ఐదో జోన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐదోజోన్‌లో కృష్ణాయపాలెం, వెంకటపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలోని 967.25 ఎకరాలను నివాస ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అందులోని 900.97 ఎకరాలను ఆర్-5 జోన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసింది. ఇవన్నీ గతంలో కీలకమైన ప్రభుత్వ విభాగాలు ఏర్పాటు కోసం కేటాయించిన భూములు.సీఆర్డీఏ చట్టంలో ఎలాంటిమార్పులు చేయకూడదన్న కోర్టు తీర్పు ఉన్నా సీఆర్‌డీఏ చట్టంలో సవరణలు చేసింది ప్రభుత్వం. ఈ సవరణల ప్రకారం రెండు అధికారాలు సీఆర్‌డీఏకు, రాష్ట్ర ప్రభుత్వానికి వస్తాయి. రాజధానిలో పేదలకు ఇళ్ల పేరుతో స్థలాలు ఇవ్వడంతో పాటు రాజధాని భూములను టౌన్?షిప్?ల పేరుతో అమ్ముకోవటానికి, బదలాయించటానికి అధికారాలు సంక్రమిస్తాయి. అయితే దీనిపనా కోర్టులో పిటిషన్లు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆర్5 జోన్ ఉత్తర్వులు చెల్లవని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తోందని ఆరోపిస్తున్నారు.

# బీజేపీ, జనసేన మధ్య ఎమ్మెల్సీ దూరం

**విజయవాడ :**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ బీజేపీకి జనసేన మద్దతు ఇవ్వకపోవడంపై ఆ పార్టీ ఆగ్రహంది. తాము అడిగినా పవన్ కల్యాణ్ స్పందించలేదని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాధవ్ అసంతప్తి వ్యక్తం చేశారు. బీజేపీ పదాధికారుల సమావేశం తర్వాత మాధవ్ మీడి?యాతో మాట్లాడారు. గతంలో కూడా తమ పార్టీ ఓటమి చెందినా.. ఆ తర్వాత పుంజుకున్న సంఘటనలు ఉన్నాయని.. ఎమ్మెల్సీ ఎన్నికలలో గతంలో కంటే బీజేపీకి మెరుగైన ఓట్లు వచ్చాయని మాధవ్ చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్ర లో మాత్రమే బీజేపీ వైఫల్యం చెందిందన్నారు. భవిష్యత్ లో ఎటువంటి అంశాలపై దృష్టి పెట్టాలనేది మా పెద్దలు సూచనలు చేశారని.. ఏప్రిల్ 14 వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రకటించారు. బీజేపీ పొత్తులకు సంబంధించి కూడా అనేక అంశాలు ప్రచారం జరుగుతున్నాయని.. ఎ బీజేపీ బలోపేతం కోసం తాము కృషి చేస్తామని మాధవ్ చెప్పారు. పొత్తులపై మాత్రం మా జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందన్నారు. పవన్ కళ్యాణ్ చెప్పినట్లు ఇరు పార్టీల కార్యకర్తలు పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ఆలోచన చేయాలని పవన్ కళ్యాణ్, మనోహర్ గారిని కోరుతున్నామని మాధవ్ తెలిపారు. ఏపీలో పవన్ కళ్యాణ్ కు మంచి అవకాశం ఉంది.. మొన్న సభకు వచ్చిన జనాన్ని అందరూ చూశారు.. ఇరు పార్టీలు కలిసి పోరాటాలు చేస్తే.. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. బీజేపీతో కలిసి ముందుకు వెళితే.. రాష్ట్రంలో ఒక ప్రభంజనం సృష్టించవచ్చన్నారు. ప్రస్తుతానికి బీజేపీ, జనసేన పొత్తుతో ముందుకు వెళుతున్నాయన్నారు. అమరావతి రాజధానిగా ఉంటుందని ఇప్పటికే చెప్పాం.. బీజేపీ దానికే కట్టుబడి ఉందని మాధవ్ చెప్పారు. ఏ పార్టీ తీర్మానం చేయకపోయినా.. బీజేపీ మాత్రమే ఏపీ రాజధాని అమరావతి అని తీర్మానం చేసిందన్నారు. బీజేపీ చేపట్టిన అనేక కార్యక్రమాలకు జనసేనను ఆహ్వానించామని వారు రాలేదన్నారు. ఎవరిలోనైనా అసంతృప్తి ఉంటే... అంతర్గతంగా వాటిని మేము పరిష్కరించుకుంటామన్నారు. బీజేపీ ఎప్పుడూ వైసీపీ ప్రభుత్వ అవినీతిపై పోరాటం చేస్తూనే ఉందని మాధవ్ చెప్పారు. ఇసుక, మైనింగ్, మద్యం వంటి అంశాలలో పోరాటాలు కూడా చేశాం గతంలో ప్రజా పోరు పేరుతో వీధి సభలు పెట్టాం ... రెండో విడత కూడా వీధి సమావేశాలు పెట్టి.. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. యువతను, ఉద్యోగులను, మహిళలను జగన్ మోసం చేశారని.. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉండి.. జీతాలు కూడా సకాలంలో వేయని పరిస్థితికి తెచ్చారని ఆరోపించారు. మే 1వ తేదీ తర్వాత ఛార్జిషీటు కార్యక్రమం చేపడతామని.. ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తామన్నారు. వాటిని అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేసిందీ వివరిస్తామని ప్రకటించారు. ఈ ఛార్జిషీటు మొత్తం రెడీ అయ్యాక బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. విశాఖలో జరిగిన సమ్మిట్ లో కేంద్ర మంత్రులు వచ్చి.. హామీలు ఇచ్చారు .. అది రాజకీయ సభ కాదు కాబట్టే... రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్నారు. ఎవరు పెట్టుబడి పెట్టినా... అది ఎపీకి వస్తుంది కాబట్టి.. మేము స్వాగతిస్తున్నామన్నారు.

# దిద్దుబాటుపై ఆలోచనలు

**విజయవాడ :**

మూడు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓడిపోవడం వైఎస్ఆర్‌సీపీకి నష్టం కాదు.. హెచ్చరికా కాదు అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందు ప్రకటించారు. పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం తగ్గిపోకుండా బహిరం గంగా ఆయన అలా కాకుండా మరోలా స్పందించే అవకాశం లేదు. కానీ అంతర్గతంగా దిద్దుబాటు చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా లేదా అన్నది ఇప్పుడు ఆ పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో ఆ పార్టీ కార్యకర్తలు స్పందిస్తున్న తీరు.. వైసీపీ హైకమాండ్ వ్యూహాలపై మాత్రం భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. ఎన్నిక ఏదైనా వైఎస్ఆర్ సీపీలో ఒకే వ్యవస్థ అన్ని బాధ్యతలు చూసుకుంటుంది. ఆ వ్యవస్థకు నేరుగా పార్టీతో సంబంధం ఉండదు. ఆ వ్యవస్థ పేరు ఐ ప్యాక్. ప్రశాంత్ కిషోర్ కు చెందిన ఈ సంస్థను వైసీపీ తరపున పూర్తి స్థాయి పొలిటికల్ మేనేజ్మెంట్ చేస్తుంది. ఫట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత కొంత మంది పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలోనే అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు వైఎస్ఆర్‌సీపీకి పట్టిన దరిద్రం ఐ ప్యాకేనని...క్షేత్ర స్థాయి పరిస్థితుల్ని అర్థం చేసుకోవడం లేదని మండిపడ్డారు. ఇక అంతర్గతంగా కూడా ఈ అంశంపై విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఐ ప్యాక్ చేతిలో మొత్తం పెట్టడం కరెక్ట్ కాదన్న అభిప్రాయం ఎక్కువ మంది వినిపిస్తున్నారు. అయితే పార్టీ అధినేత సీఎం జగన్ కు ఐ ప్యాక్ మీద ఎక్కడా లేనంత నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని కొనాసిగిస్తే.. ఐ ప్యాకే వచ్చే ఎన్నికల్లో లీడ్ చేస్తుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలో అయినా జగన్ మనసు మార్చుకుని ఐ ప్యాక్ ను పక్కన పెడితే బాగుండని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్‌సీపీ నేతలు , కార్యకర్తల్లో ఓ రకమైన నిస్తేజం కనిపిస్తోంది. దీనికి కారణం వాలంటీర్, సచివాలయ వ్యవస్థతో అసలు పార్టీ కార్యకర్తలకు విలువ లేకుండా పోవడమే. ద్వితీయ శ్రేణి నేతలు కూడా చిన్న పని కోసం అయినా వాలంటీర్ల వద్దకు వెళ్లాల్సిందే. ఇది వైసీపీ క్యాడర్‌లో అసంతృరప్తికి కారణం అయింది. ఇక ఓ మాదిరి స్థాయి నేతలు.. తాము పార్టీ కోసం చాలా పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టుకున్నా.. ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని అసంతృప్తికి గురవుతున్నారు. కొంత మంది పనులు చేసినప్పటికీ బిల్లులు అందడం లేదు. గ్రామాల్లో పంచాయతీల అధికారాలు మొత్తం గ్రామ సచివాలయాలకే ఉండటంతో వైసీపీ అధినాయకత్వంపై గ్రామ స్థాయి నాయకత్వం కూడా అసంతృప్తిగా ఉంది. అందుకే క్యాడర్ ను పట్టించుకోవాలన్న సందేశాలు ఎక్కువగా ఆ పార్టీ హైకమాండ్‌కు అందుతున్నాయి. ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడంతో కనీస మౌలిక సదుపాయాల సమస్య కూడా వెంటాడుతోంది. రోడ్లు, మంచి నీరు వంటి విషయాల్లో గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక ఆర్ అండ్ బీ రోడ్ల సంగతి చెప్పాల్సిన పని లేదు. ఎన్నికల ఏడాదిలో ప్రజలకు సంబంధించి ఇలాంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎక్కువ సూచనలు వస్తున్నాయి. సంక్షేమం విషయంలోనూ మొదటి ఏడాది.. ఆ తర్వాత ఏడాది పథకాలు అందుకున్న లక్షల మందిని ఇప్పుడు అనర్హుల్ని చేశారని ఇప్పుడు వారందరికీ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించుకుంటే... పరిస్థితి మెరుగవుతుందని అంటున్నారు. కారణం ఏదైనా అతి భారీ మెజార్టీతో గెలిచిన ప్రభుత్వానికి చాలా స్వల్ప కాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్న అభిప్రాయం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రజల్లో బలపడుతోంది. దీన్ని తగ్గించుకో వాలంటే.. వైసీపీ పెద్దలు వ్యూహం మార్చుకోవాల్సిందేనని ఎక్కువ మంది నమ్ముతున్నారు. మరి ఆ పార్టీ హైకమాండ్ ఏం చేస్తుందో మరి !

## ఈశాన్య రాష్ట్రాలకు ట్రైన్

**న్యూఢిల్లీ**

దేశంలో వివిధ ప్రాంతాలను కలిపేలా భారత రైల్వే శాఖ కొత్త రూట్లలో కొన్ని రైళ్లను ప్రారంభించింది. ఈశాన్య రాష్ట్రాలను చూసేందుకు ఇటీవలే భారత్ గౌరవ్ డెలుక్స్ అనే టూరిస్టు ట్రైన్ ను ప్రవేశపెట్టింది. ఈ రైలు లోపల ఎలా ఉంటుందో అని ప్రయాణికులు తెలిసేవిధంగా రైల్వే శాఖ ఓ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో ప్రయాణికులకు కావల్సిన చిన్న లైబ్రరీ, డైనింగ్ రెస్టారెంట్ లు కూడా ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థమే ఈ వసతులన్ని ఏర్పాటు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా ఈ ట్రైన్ 15 రోజుల పాటు టూర్ వేయనుంది. మార్చి 21న ఈ టూర్ ఢిల్లీలోని సఫ్ దర్జంగా రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైంది. ఈ ప్రయాణంలో అస్సాం, త్రిపురా, నాగలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలను చూపించనున్నారు. దాదాపు 156 టూరిస్టులు ప్రస్తుతం ఈ ట్రైన్ లో ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


## వివేకా కేసు విచారణ 29కు వాయిదా

**హైదరాబాద్**

వివేక హత్య కేసులో ఏ1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో సీబీఐ పిటిషన్ వేసింది. దీనిపై విచారించిన కోర్టు ఆయనకు నోటీసులు జారీ చేసింది కేసును 29కి వాయిదా వేసింది. వివేక హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతోంది సీబీఐ. గతంలో సిట్ విచారణ చేస్తున్న టైంలో టెక్నికల్‌గా గంగిరెడ్డికి బెయిల్ వచ్చింది. 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయలేదన్న కారణంతో అప్పట్లో గంగిరెడ్డికి బెయిల్ వచ్చింది. ఈ కేసులో సీబీఐ వచ్చినప్పటి నుంచి గంగిరెడ్డి బెయిల్ రద్దు కోసం ప్రయత్నిస్తోంది. కానీ వివిధ కారణాలతో అది వీలుపడటం లేదు. ఇప్పుడు మరోసారి గంగిరెడ్డి బెయిల్‌పై సీబీఐ న్యాయపోరాటం చేస్తోంది. వివేక హత్య కేసులో ఏ1 ఉన్న గంగిరెడ్డి 2019 మార్చి 28న అంటే నాలుగేళ్ల క్రితం అరెస్టు అయ్యారు. అప్పట్లో ఈ కేసును విచారించిన సిట్ ఆయన్ని అదుపులోకి తీసుకొని విచారించింది. అయితే నిందితుడిని అరెస్టు చేసిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయలేకపోయింది సిట్. దీంతో టెక్నికల్‌గా గంగిరెడ్డికి బెయిల్ ఇస్తున్నట్టు పులివెందుల కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి ఆయన బయటే ఉన్నారు. తర్వాత వివేక హత్య కేసు ఫైల్ సిట్ చేతుల నుంచి సీబీఐ టేబుల్‌పైకి వచ్చింది. పలువురిని పలుదఫాలుగా విచారించిన సిబీఐ, కీలక సాక్ష్యాలతో 2021 అక్టోబర్‌లో మొదటి ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది. ఈ కేసులో మరింత ముందుకు వెళ్లాలంటే గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కూడా పిటిషన్ వేసింది. కేసును పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీబీఐ వేసిన బెయిల్ రద్దు పిటిషన్ కొట్టేసింది. ఏపీ హైకోర్టు నిర్ణయంపై సుప్రీం కోర్టుకు వెళ్లింది సీబీఐ. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని రిక్వస్ట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారణలో ఉండగానే... వివేక హత్య కేసును ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ అయిపోయింది. దీంతో బెయిల్ రద్దు పిటిషన్ సుప్రీంకోర్టు విచారణకు వచ్చింది. ముందు తెలంగాణ హైకోర్టులో తేల్చుకున్నాకే తమ వద్దకు రావాలని చెప్పింది దేశఅత్యున్నత ధర్మాసనం. సుప్రీం కోర్టు చెప్పిన నిర్ణయంతో మళ్లీ తెలంగాణ హైకోర్టు మెట్లు ఎక్కింది సీబీఐ. వివేక హత్య కేసు మరింత వేగంగా ముందుకు వెళ్లాలంటే గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని అభిప్రాయపడింది. ఆయన బెయిల్ రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. సీబీఐ వేసిన పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు... గంగిరెడ్డికి నోటీసులు జారీ చేసింది. సీబీఐ పిటిషన్‌కు సమాధానం చెప్పాలని ఆదేశించింది. అనంతరం కేసును 29కి వాయిదా వేసింది. ఇప్పటికే వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ఆలస్యం కావడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు విచారణ పురోగతిని సీల్డ్ కవర్‌లో అందచేయాలని ఆదేశించింది. కేసు విచారణను దర్యాప్తు అధికారి ఎందుకు పూర్తి చేయడం లేదని... వివేకా హత్య కేసు విచారణను త్వరగా ముగించలేకపోతే వేరే దర్యాప్తు అధికారిని ఎందుకు నియమించకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంపై సీబీఐ డైరక్టర్ అభిప్రాయం తెలుసుకుని చెప్పారని సీబీఐ తరపు లాయర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణలో ఆలస్యం చేస్తున్నారని దర్యాప్తు అధికారిని మార్చాలంటూ నిందితుడు శివశంకర్ రెడ్డి భార్య తులశమ్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా జరిగిన విచారణలో కేసును దర్యాప్తు అధికారి సక్రమంగానే దర్యాప్తు చేస్తున్నారని సీబీఐ తరపు లాయర్ కోర్టుకు తెలిపారు.

## పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం

**కోరుట్ల,**



పౌష్టికాహారంతోనే ప్రతి వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కాసుల హేమలత, ఇ. ప్రేమలత అన్నారు. గురు వారం కోరుట్ల పట్టణం లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారాలకు చిరు ధాన్యాల ఉపయోగం, ప్రయోజనం పై పిల్లలకు పరిపూర్ణ అవగాహన కల్పించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కాసుల హేమలత, ఇ. ప్రేమలత అంగన్ వాడి టీచర్లు పాల్గొన్నారు.

# రాజశేఖర్ ఇంట్లో క్వశ్చన్ పేపర్స్

**హైదరాబాద్:**

టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. నాలుగోరోజు నిందితులను విచారించిన అధికారులు పలు కీలక విషయాలను రాబట్టినట్టుగా తెలుస్తోంది. పరీక్ష రాసిన గోపాల్, నీలేశ్ సోదరుడు రాజేంద్రనాయక్ డబ్బులు సమకూర్చినట్టుగా గుర్తించారు. మేడ్చల్ లో పనిచేసే కానిస్టేబుల్ ద్వారా మరికొంత డబ్బు ఇప్పించినట్టుగా తెలుస్తోంది. నీలేశ్, గోపాల్ పరీక్ష రాశారు. పేపర్ ఇచ్చినందుకు గానూ.. రూ.14 లక్షలు సమకూర్చారని తెలుస్తోంది.లీకేజీ కేసులో రోజుకో కొత్త విషయం బయటకు వస్తుంది. నిందితులు ఆరు రోజుల కస్టడీలో ఉన్నారు. నాలుగో రోజు సిట్ అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టారు. మూడో రోజు విచారణలోనూ.. కీలక విషయాలను తెలుసుకున్నారు అధికారులు. ప్రధాన నిందితులు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి యాక్సెస్ చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. ప్రశ్నపత్రం కాపీ చేసిన విధానం మీద ఆరా తీశారు.బడంగ్ పేటలోని ప్రవీణ్ ఇంట్లో సోమవారం సిట్ అధికారులు సోదాలు చేసిన విషయం తెలిసిందే. మణికొండలోని రాజశేఖర్ రెడ్డి ఇంట్లో సోదాల సమయంలో మరికొన్ని ప్రశ్నపత్రాలను సిట్ స్వాధీనం చేసుకుందని సమాచారం. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజీకి సంబంధించి.. నిందితుడు రాజశేఖర్ కీలక పాత్ర ఉన్నట్టుగా గుర్తించారు. క్వశ్చన్ పేపర్స్ కమిషన్ కు చేరాయని తెలిశాక.. రాజశేఖర్ అలర్ట్ అయ్యాడు. కంప్యూటర్లకు మరమ్మత్తులు, సాఫ్ట్ వేర్ అప్ డేట్ చేసినట్టుగా తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే.. కాన్ఫిడెన్షియల్ సూపరింటెండ్ శంకర్ లక్ష్మి కంప్యూటర్ ను అనువుగా.. మలుచుకున్నట్టుగా గుర్తించారు. మె?దట విఫలమై.. ఆ తర్వాత ప్రశ్నపత్రాలు కాపీ చేసుకున్నట్టుగా తెలుస్తోంది.శంకర్ లక్ష్మిని సిట్ అధికారులు ప్రశ్నించారు. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ లోని సిస్టం పాస్ వర్డ్, యూజర్ ఐడీ రాజశేఖర్ కు ఎలా తెలుసనే విషయంపై ప్రశ్నలు కురించారు. ప్రవీణ్, రాజశేఖర్ తన దగ్గర నుంచి పాస్ వర్డ్ దొంగిలించి ఉంటారని శంకర్ లక్ష్మి చెబుతోంది. టీఎస్పీఎస్సీ కార్యాలయంలో ఇప్పటికే ప్రశ్నించారు. నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా.. శంకర్ లక్ష్మిని సిట్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు.ఈ కేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. నిందితులు ఫోన్ లో మాట్లాడిన వారి వివరాలు సేకరిస్తున్నారు. టీఎస్పీఎస్సీ నుంచి తీసుకొచ్చిన కంప్యూటర్లను సైబర్ క్రైమ్ పోలీసులు విశ్లేషిస్తున్నారు.

## 40 మందికి నోటీసులు జారీ

టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో 9 మంది నిందితులను అదుపులోకి తీసుకుని అధికారులు ప్రశ్నిస్తున్నారు. వారి సెల్ఫోన్లు స్వాధీనం చేసుకుని కాల్‌డేటాను పరిశీలించారు. పరీక్ష నిర్వహించిన సమయంలో ఎక్కువగా ఎవరెవరితో మాట్లాడారనే విషయాన్ని తెలుసుకొని వారందరికీ నోటీసులు జారీ చేశారు.అంతేకాకుండా నిందితులు ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డికి టీఎస్పీఎస్సీలో ఎవరు సహకరించారనే దానిపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇప్పటికే టీఎస్పీఎస్సీలో పనిచేస్తూ 10 మందికి పైగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసి మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు సిట్ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వారిని కార్యాలయానికి పిలిచి విచారించారు.లీకేజీకి సంబంధించి దాదాపు 40మంది సిబ్బందికి కూడా సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో కొందరికి 100 మార్కులకుపైగా వచ్చినట్లు సమాచారం. టీఎస్పీఎస్సీ నుంచి మరిన్ని వివరాలు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వివరాల వస్తే టీఎస్పీఎస్సీ సిబ్బంది ఎంతమంది గ్రూప్-1 ప్రిలిమ్స్ రాశారు? ఇందులో ఎంతమందికి 100 మార్కులు వచ్చాయి? అనే విషయంపై సిట్ అధికారులకు స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.మరోవైపు నిందితురాలు రేణుక, ఆమె భర్త డాక్యా నాయక్ పలువురు పోటీ పరీక్షల అభ్యర్థులతో పాటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడినట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. రేణుక కాల్ డేటా ఆధారంగా అభ్యర్థులతో పాటు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరో వైపు ఈకేసులో 9మంది నిందితుల 5వ రోజు కస్టడీ ముగిసింది. నిందితులను సిట్ కార్యాలయం నుంచి మధ్య మండల డీసీపీ ఆఫీసుకు తరలించారు.

# పేదోడికి కార్పొరేట్ వైద్యం అందించడమే సర్కారు లక్ష్యం

**నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వరం**

**-జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**



**మంథని**

ఆర్థికస్థోమత లేని పేద కుటుంబాలకు కార్పోరేట్ వైద్యం అందించాలన్నదే సర్కారులక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్‌పుట్ట మధూకర్ అన్నారు. గురువారంమంథని పట్టణంలోని రాజగృహాలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఆయన లబ్ధిదారులకు అందజేశారు. రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన గాజుల రవికాంత్ కు 42,500 రూపాయల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వరంలాంటిదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లోచికిత్స పొంది ఆర్థికంగా నష్టపోతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేలా సీఎం కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ పథకాన్నిపకడ్బందీగా అమలు చేస్తున్నారని అన్నారు. ఆర్థికస్థోమత లేని నిరుపేదలకు ఆస్పత్రుల్లో వైద్యఖర్చులకు ప్రభుత్వం ద్వారా సాయం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ఈ పథకం ఉన్నా పేదోడి దరికి చేరలేదన్నారు. పేదల ఆరోగ్యాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, మంథనిలాంటి మారుమూల గ్రామాల్లోని ఏ ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ది చేకూరలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం , సీఎం కేసీఆర్ పరిపాలనలో ఎంతోమందికి ఈ పథకం ద్వారా లబ్ది జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఎంపీపీ కొండ శంకర్, నాయకులు బత్తుల సత్యనారాయణ కొత్త శ్రీనివాస్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఏపీ ప్రెస్ అకాడమీమాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి కన్నుమూత

**అమరావతి**

సీనియర్ జర్నలిస్ట్, ఎపి ప్రెస్ అకాడమి మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఉగాది పర్వదినాన మృతి చెందారనే వార్త జర్నలిస్ట్ లను ఆవేదనకు గురి చేసింది. ఏపీ ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఇకలేరు అనే విషయం ఆయన గురించి తెలిసిన వారిని, పరిచయం ఉన్న వారిని అయ్యో అనేలా బుధవారం 'రాత్రి' సమయం శ్రీనాథ్ రెడ్డిని అనంతలోకాలకు తీసుకెళ్లింది. వైసీపీ ప్రభుత్వం 2019లో దేవిరెడ్డిని ప్రెస్ అకాడమి చైర్మన్‌గా నియమించింది. 2021 నవంబరు 7తో ఆయన రెండేళ్ల పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి మరో ఏడాదిపాటు పదవీ కాలాన్ని పొడిగిస్తూ జగన్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. దానితో మొన్న మొన్నటి వరకు ఆయన ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ గా విధులు నిర్వహించారు. దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి జన్మ స్థలం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కొవరంగుట్టపల్లి ప్రాంతం. ఆంధ్రప్రభ పత్రిక ద్వారా 1978లో ఆయన జర్న లిజం వృత్తిలోకి చేరారు. ఆయన సుమారు 40 ఏళ్ళ పాటు జర్నలిజం రంగంలో కొనసాగారు. కడప జిల్లాలో జర్నలిస్ట్ గా పనిచేసినప్పు డు దేవిరెడ్డి రాయలసీమ వెనుకబాటుకు సంబంధించి రాజకీయ,ఆర్థిక, సామాజిక అంశాలపై 'సెవెన్ రోడ్స్ జంక్షన్' పేరుతో ఆయన రాసిన కాలమ్స్ పాఠకుల ప్రాచుర్యం పొందాయి. 1990వ దశకంలో ఆయన కొన్నేళ్లపాటు బీబీసీ రేడియోకు పనిచేయడం జరిగింది.ఇండియన్ ఎక్స్ ప్రెస్, సాక్షి పత్రికల్లో కూడా జర్నలిస్ట్ గా పనిచేశారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కడప జిల్లా అధ్యక్షుడిగా సుమారు 24 సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత ఇదే సంఘానికి రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేయడం జరిగింది. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం ప్రెస్ అకాడమీ చైర్మన్ బాధ్యత లు ఆయనకు అప్పగించింది.

# సమాజంలో మార్పుకోసం భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

**సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరశేఖర్**

**బద్వేలు**



భారత కమ్యూనిస్టు పార్టీ బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ నగర్ లో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్ అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28 న లాహోర్ సమీపంలోని బంగా అనే గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారని, జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్ సింగ్ ది అని అన్నారు. బ్రిటిష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేకమంది బలిదానాలు చేశారని, అందులో విప్లవ విద్యార్థి యువజనులు తమ ప్రాణాలను తృణప్రాయం అర్పించారని, జైళ్లను, లాఠీలను, తూటాలను, ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధ్రువతారని కొనియాడారు. బ్రిటిష్ పాలన పోవడమే కాదు ఒక మనిషిని వేరొక మనిషి దోచుకొనుటకు వీలులేని న్యాయ సమ్మతమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కావాలని భగత్ సింగ్ అతని అనుచరులు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవులను ఉరితీసారని, ఉరి కొయ్యలను సైతం ముద్దాడినటువంటి భారత దేశ ముద్దుబిడ్డ సర్దార్ భగత్ సింగ్ అని అన్నారు. కార్మిక వివాదాల బిల్లులకు ఢిల్లీ అసెంబ్లీలో చట్టాలుగా చేస్తున్న సమయంలో భగత్ సింగ్ పొగ బాంబులు వేసి కరపత్రాలు చల్లుతూ ఉపన్యాసాలు చేశారని, ఇంక్విలాబ్ జిందాబాద్ సామ్రాజ్యవాదం నశించాలి అని బిగ్గరగా నినదీస్తూ యువతలో చైతన్య స్ఫూర్తి నింపి, యావత్ భారతదేశ యువతను ఉత్తేజపరిచి దేశ స్వాతంత్రం కోసం జరిగే స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో యువతను భాగస్వామ్యం చేయడంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు.బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులను ఉరితీసే ముందు ఉరికొయ్యలను సైతం వారు ముద్దాడారని కొనియాడారు. వారి అమృత్వానికి నేటికీ 92 ఏళ్ళు నిండాయని వారు కోరుకున్న సమాజం నేటికి సిద్ధించలేదని అనేక సామ్రాజ్యవాద దేశాలు నేడు మన దేశాన్ని దోచుకుంటున్నాయని, దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థి, యువజనులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం నేడు ఏర్పడి ఉందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వరుసగా అధికారం చేపట్టి తొమ్మిది సంవత్సరాలు కావస్తుంది. అయినా కూడా సమస్త రంగాలను సంక్షోభంలోకి నెట్టుతూ, ముఖ్యంగా జాతీయ నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ, కార్పోరేట్ కరణ చేస్తూ రిజర్వేషన్లకు పాతర వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ తెల్లదొరలు పోయి నల్ల దొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం అని అప్పుడే భగత్సింగ్ అన్నారు అని, భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి,యువత పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ్ కి చౌకి దార్ అని చెప్పుకొని తిరిగే నరేంద్ర మోడీ దేశాన్ని అమ్మకానికి పెడుతున్నాడని, ఆనాడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు ,గాంధీ లాంటి స్వాతంత్ర సమరయోధులు దేశ స్వాతంత్రం కోసం, పౌరుల స్వేచ్ఛ కోసం త్యాగాలు చేస్తే ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వాలు వారి త్యాగాలను మరిచి పౌరుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని, వ్యవస్థలను సర్వం నాశనం చేయడానికి పూనుకున్నారని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల విధానాలను ప్రతి ఒక్కరు ఖండిస్తూ ముందుకెళ్లాలని కోరారు. అతిపిన్న వయసులోనే భారతదేశం స్వాతంత్రం కోసం ఆ ఉద్యమంలో పోరాడి ప్రాణ త్యాగం చేసినటువంటి సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తూ వారి ఆశయాలకు తూట్లు పొడిచే వారిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను వక్రీకరించడానికి ప్రయత్నిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ ఇవ్వకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని, ఇప్పటికైనా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం హిందూ రాజ్య స్థాపనకు కంకణం కట్టుకుందని దళితులపై, ఆదివాసులపై, మహిళలపై, ముస్లిం మైనార్టీలపై ,హిందూ మతోన్మాద దాడులు పెరిగిపోయాయని, కులాలు, మతాలు ప్రాంతాల మధ్య విభజనలు సృష్టిస్తూ తినే తిండిపై, కట్టుకునే బట్టపై ఆంక్షలు విధిస్తున్నారని భారత దేశ సమాజపు మౌలిక అంశాలను నేలమట్టం చేసే బుల్డోజర్ సంస్కృతిని నరేంద్ర మోడీ, అమిత్ షాలు అమలుపరుస్తూ, లౌకిక విలువల్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. లౌకిక భారత రక్షణకై విద్యార్థి యువజనులు భగత్ సింగ్ పూర్తితో నడుం బిగించి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి జకరయ్య. సహాయ కార్యదర్శి చంద్రమోహన్ రాజు. పట్టణ కార్యదర్శి పి. బాలు. కార్యవర్గ సభ్యులు పివి రమణ. విజయమ్మ. ఆర్ శీను. పెంచలయ్య. కే బాబు. నాగ సుబ్బయ్య. సుబ్బారెడ్డి నాయకులు తిరుపతి. సిద్ధయ్య. లచ్చమ్మ. రవి. తదితరులు పాల్గొన్నారు

# కేసీఆర్ నాయకత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఎంతైనా అవసరం విశాఖలో బిఆర్ఎస్ నేతలు

**విశాఖపట్నం**

బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నాయ కత్వం ఆంధ్ర రాష్ట్రానికి అవసరమని ఆ పార్టీ నాయకులు జగన్ మురారి అన్నారు.విశాఖలో మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ బిఆ ర్ఎస్ ఆంధ్రప్రదేశ్ నాయకుడిగా కచ్చితంగా ఆంధ్ర ప్రయోజనాల కోసం మాత్రమే పని చేస్తానని,స్వార్ధ రాజకీ య నాయకుడిగా ఉండనని ఆయన అన్నారు.రైతు ప్రభుత్వం అని చెప్పు కుంటున్న వైసీపీ రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతు లను పెయిడ్ ఆర్టిస్టులని అవమాని స్తోందని,విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన రైతులు, నిర్వా సితులు ఉద్యమిస్తుంటే వారికి వెన్ను చూపుతోందని జగన్ మురారి పేర్కొ న్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ బలపడుతోందని, ఎన్నికలకు ముందు పార్టీలో చాలా మంది వివిధ పార్టీలకు చెందిన పెద్ద పెద్ద నాయకులు చేరతారని,విశాఖ రూరల్ కి చెందిన ఒక అధికార పార్టీ శాసనసభ్యుడు బిఆర్ ఎస్ తో టచ్ లో ఉన్నారని తెలిపారు..

# జర్నలిస్టులపై దాడికి నిరసనగా ర్యాలీ

**పరిగి**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని అమరవీల చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు జర్నలిస్టులు. తెలంగాణ రాష్ట్రం లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు .జర్నలిస్ట్ల పై దాడులతో పాటు అరెస్టులకు నిరసనగా పరిగి నియోజకవర్గం జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తు ఆర్టీసీ బస్టాండ్ ముందు బైటాయించి ధర్నా చేపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టుల ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నిజాలు రాస్తే అరెస్టు చెయ్యడం ఎంటని నిలదీశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మెమొరడంఅందించారు. జర్నలిస్టుల ర్యాలీ కి మద్దతుగా ప్రజా సంఘాలు వివిధ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు పలికారు. ప్రభుత్వన్ని వ్యతిరేకిస్తు మాట్లాడారు, కెసిఆర్ పై మండిపడ్డారు.

# జర్నలిస్టుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

**టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్ తో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన**

**మెట్ పల్లి**

రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా జర్నలిస్ట్ ల పై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తూ జైలు పాలు చేయడం దురదృష్టకర పరిణామం అని జర్నలిస్ట్ ల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆగ సురేష్, ప్రధాన కార్యదర్శి భూరం సంజీవ్ లు డిమాండ్ చేశారు.ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే ఐజేయు జగిత్యాల జిల్లా శాఖ ఆదేశాలతో భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు ల వర్ధంతి సందర్భంగా మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సేవ్ జర్నలిస్ట్ కార్యక్రమం చేపట్టి ఆర్డీవో కార్యాలయం ముందు నల్ల రిబ్బన్ లు ధరించి నిరసన తెలిపి అనంతరం ఆర్డీవో కార్యాలయం లో అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.పాలకులు జర్నలిస్ట్ లను చిన్న చూపు చూస్తున్నారని.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్రిక, మీడియా స్వేచ్ఛను హరిస్తున్నాయని. నిజాలను నిర్భయంగా రాస్తే దాడులు చేస్తూ, కేసు లు నమోదు చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్ట్ లు ప్రమాదంలో ఉన్నారని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విలేకరి, ప్రజల పైన ఉందన్నారు. జర్నలిస్ట్ లకు వేతనాలు లేవని,కొందరికి వేతనాలు వచ్చిన చాలీచాలని జీతం తో ఉద్యోగ భద్రత లేకుండా జీవిస్తున్నారని. జర్నలిస్ట్ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని లేదా వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంచి సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్న పత్రిక, మీడియా కు స్వేచ్ఛ ఉండాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్ట్ ల హక్కులను హరించకుండ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి జర్నలిస్ట్ ల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. జర్నలిస్ట్ లపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు మాసుల ప్రవీణ్, మహ్మద్ అజీమ్, గౌరవ అధ్యక్షుడు, ఐజేయు జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం కిషన్, కోశాధికారి అలలా రాజేష్, ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శులు జంగం విజయ్, తరి రాజశేఖర్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఓంకారి శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు ఎస్.కె రఫీ ఉల్లా,ఎస్.కె సాజీద్, సోయల్ హుస్సేన్,ఎండి అజీముద్దీన్, మోసిన్, శ్రీనివాస్, ఫిరోజ్ ఖాన్, దీకొండ మురళి,మహేందర్, ముత్యాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చెమటలు పట్టిస్తున్న అమృత్ పాల్

**ఛండీఘడ్ :**

వారీస్ పంజాబ్ దే అధినేత అమృత్ పాల్ సింగ్ గత కొన్ని రోజులుగా పంజాబ్ పోలీసులకు చెమటలు పట్టిస్తున్నాడు. వేషాలు మార్చుకుంటూ వివిధ ప్రాంతాల్లోకి పారిపోతూ ముప్పు తిప్పలు పెడుతున్నాడు. అయితే తాజాగా అమృత్ పాల్ కు చెందిన ఓ ఫోటో సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. ఆ చిత్రంలో అమృత్ పాల్ సింగ్ ఓ బండిపై తన బైక్ ని తీసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. అమృత్ పాల్ సింగ్ ను పట్టుకునేందుకు పోలీసులు ఏకంగా ఓ ఆపరేషన్ నే ప్రారంభించారు. దాదాపు ఆరు రోజుల నుంచి అమృత్ పాల్ తప్పించుకు తిరుగుతున్నాడు. గత శనివారం తన కాన్వాయ్ లో వస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో బైక్ పై పారిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం వెతుకుతూనే ఉన్నారు.ఇప్పటివరకు అతనికి సంబంధించిన 100 మందిని అరెస్టు చేశారు. అమృత్ పాల్ ను ఇప్పటివరకు అదుపులోకి తీసుకోకపోవడంతో పంజాబ్ హైకోర్టు కూడా అధికార ప్రభుత్వంపై విమర్శలు చేసింది. వేలాది మంది పోలీసులు ఉండి? అమృత్ పాల్ ను పట్టకోవడానికి ప్లాన్ వేసినప్పటి అతడు తప్పించుకోవడం ఇంటిలిజెన్స్ ఫెయిల్యూర్ అని ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు పంజాబ్ లో శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగించేవారని ఎవ్వరినీ వదిలిపెట్టమని..వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ తెలిపారు.

## చివరి 15 నిమిషాల్లోనే బిట్ పేపర్

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 10 వరకు పరీక్షలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది నుంచి పదోతరగతి పరీక్షల్లో 11 పేపర్లకు బదులుగా 6 పేపర్లకు కుదించింది. అయితే 100 శాతం సిలబస్ తోనే పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో పరీక్షలను సంబందించి పలు ముఖ్యమైన విషయాలను పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షలో భాగంగా విద్యార్థులకు ఇచ్చే మల్టీపుల్ చాయిస్ ప్రశ్నాపత్రం (బిట్ పేపర్)ను ఆఖరి 15 నిమిషాల్లోనే ఇవ్వాలని తెలిపింది. అంతేకాకుండా.. జనరల్ సైన్స్ పరీక్షలోని రెండు ప్రశ్నాపత్రాలను ఒకేసారిగా కాకుండా నిర్దశించిన సమయానికి విద్యార్థలకు విడివిడిగా ఇవ్వాలని తెలిపింది.అయితే.. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లుగానే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కాగా..ఇందులో జనరల్ సైన్స్ పరీక్షలో 40 మార్కుల చొప్పున రెండు పేపర్లు ఉంటాయి..ఒకటి ఫిజికల్ సైన్స్ కాగా మరొకటి బయాలాజికల్ సైన్స్. ఇక.. జనరల్ సైన్స్‌లో తొలుత ఓ పేపర్‌ను ఇచ్చి దానికి సమాధానాలు రాసేందుకు 90 నిమిషాలు సమయం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఇరబై నిమిషాల సమయం ఇచ్చి విద్యార్థులకు రెండో పేపర్ ఇవ్వాలని తెలిపారు. ఇక రెండో పేపర్ రాసేందుకు మరో 90 నిమిషాల సమయం కేటాయించాలని చెప్పారు.. మల్టీపుల్ చాయిస్ ప్రశ్నల పత్రాన్ని పరీక్ష చివరి 15 నిమిషాల ముందు ఇవ్వాలని సూచించారు. ఇక విద్యార్థులు ఆ పదిహేను నిమిషాల్లోనే అందులోని పది ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

## భారత్ షట్లర్ల దూకుడు

**ముంబై**

బాసెల్‌లో జరుగుతున్న స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ చైనాకు చెందిన షి యు క్విని ఓడించి పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్‌ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్, పురుషుల సింగిల్స్ ప్రారంభ రౌండ్‌లో 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత అయిన షి యు క్విపై 21-17 19-21 21-17 తేడాతో విజయం సాధించి రెండో గేమ్ పతనం నుండి కోలుకుని తన మంచి పరుగు కొనసాగించాడు.ఇక, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన హైదరాబాద్ స్టార్ షట్లర్ పివి సింధు కూడా తన టైటిల్ డిఫెన్స్‌ను సానుకూలంగా ప్రారంభించింది. మహిళల సింగిల్స్‌లో లాప్-సైడ్ ప్రారంభ రౌండ్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన జెంజిరా స్టాడెల్‌మాన్‌ను 21-9 21-16 తేడాతో ఓడించింది. ప్రణయ్ తదుపరి ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్‌తో తలపడగా, సింధు 2022 ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్న జట్టులో భాగమైన ఇండోనేషియాకు చెందిన 20 ఏళ్ల పుత్రి కుసుమ వర్దానీతో తలపడనుంది.అలాగే గురువారం కిదాంబి శ్రీకాంత్ హాంకాంగ్‌కు చెందిన లీ చెయుక్ యియుతో తలపడనున్నాడు. జాతీయ ఛాంపియన్ మిథున్ మంజునాథ్ చైనీస్ తైపీకి చెందిన చియా హావో లీతో తలపడగా, పురుషుల విభాగంలో రెండో సీడ్ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి తైవాన్‌కు చెందిన ఫాంగ్-చిహ్ లీ, ఫాంగ్-జెన్ లీతో తలపడనున్నారు.

## 16 కోట్ల మంది డేటా చోరి

**హైదరాబాద్**

దేశవ్యాప్తంగా కోట్లాది మందికి సంబంధించిన వ్యక్తిగత డేటాను చోరీ చేస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాగా ఏర్పడి ఈ చోరీకి పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా 16 కోట్ల మందికి సంబంధించిన ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్ల డేటాను నిందితులు చోరీ చేసినట్లు గుర్తించారు. హైదరాబాద్ నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వందల సంఖ్యలో కేసులు నమోదైన క్రమంలో ఈ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. పలు ఆన్ లైన్ వెబ్ సైట్ల నుంచి ఈ డేటాను దొంగిలిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. పాన్ ఇండియా గవర్నమెంట్ ఉద్యోగుల డేటాతో పాటు పలు బ్యాంక్ ల క్రెడిట్ కార్డ్ ల డేటా, పాన్ కార్డ్, పాలసీ బజార్ వంటి పేరున్న ఆర్గనైజేషన్ ల నుండి డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు వెల్లడించారు. చోరీ చేసిన డేటానంతా పలువురు అక్రమార్కులకు అమ్ముకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే దేశ వ్యాప్తంగా అరెస్టులు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సైబరాబాద్ పరిధిలో మొత్తం ఆరుగురు సభ్యులున్న ముఠాను అదుపులోకి తీసుకోగా.. నిందితులు నాగపూర్, ఢిల్లీ, ముంబై చెందిన వారిగా సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ఆర్మీకి చెందిన రెండున్నర లక్షల మంది డేటా కూడా చోరీ అయినట్లు నిర్ధారించారు. దేశ భద్రతకు భంగం కల్గించేలా సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత డేటాను అపహరిస్తున్నారని సీపీ వివరించారు. బీమా, లోన్లకు అప్లై చేసిన నాలుగు లక్షల మంది డేటా చోరీకి గురైందన్నారు. కోట్లాదిగా సోషల్ మీడియా ఐడీలు, పాస్ వర్డ్ లు కూడా లీకయ్యాయని చెప్పుకొచ్చారు. ఆర్మీకి చెందిన రెండున్నర లక్షల మంది డేటా, ఢిల్లీలో 35 వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల డేటా చోరీకి గురైందని తెలిపారు. కేటుగాళ్లు ఇన్సూరెన్స్, క్రెడిట్ కార్డులు, లోన్ అప్లికేషన్ల నుంచి వివరాలు సేకరిస్తున్నారని స్పష్టం చేశారు. డేటా చోరీ గ్యాంగ్ లకు ఆయా కంపెనీల్లో కొందరు ఉద్యోగులు సాయం చేస్తున్నారని... సెక్యూరిటీ ఉందనుకున్న బ్యాంక్ అకౌంట్ల నుంచి కూడా నేరగాళ్లు చోరీలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. సేకరించిన వ్యక్తిగత డేటాను విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. ఇప్పటికే పలు ముఠాలను అరెస్ట్ చేశామని సీపీ వివరించారు.

# కాసులు కురిపిస్తున్న జరిమానాలు

**విజయవాడ:**

రైళ్లలో టిక్కెట్లు లేకుండా జర్నీ చేసే వారి సంఖ్య తక్కువేమి కాదు. దక్షిణాది రాష్ట్రాల్లో కాస్త తక్కువే కాని ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే టిక్కెట్ కొని ప్రయాణించడాన్ని నేరంగా చూసే రాష్ట్రాలు కూడా ఉన్నాయి. వాటి సంగతెలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో మాత్రం టిక్కెట్లు లేని రైలు ప్రయాణికుల నుంచి కోట్లాది రుపాయలు జరిమానాలు వసూలు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కొంతమంది సిబ్బంది కోట్లలో జరిమానాలు కూడా వసూలు చేశారు.విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన ఎంజె.మాథ్యూ అనే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ గుడివాడ స్క్వాడ్‌లో పనిచేస్తున్నారు. ఏడాది కాలంలో ఈయన అక్షరాలా కోటి రెండు లక్షల రుపాయల జరిమానాలు వసూలు చేశారు. టిక్కెట్లు లేకుండా ప్రయాణించే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించడంతో పాటు, నిర్ణీత పరిణామం కంటే ఎక్కువగా లగేజీ తీసుకెళ్తున్న వారిని గుర్తించి ఈ జరిమానాలు విధించారు.ఎంజె.మాథ్యూ మొత్తం 12,707 కేసులు నమోదు చేశారు. అనధికారిక ప్రయాణికులతో పాటు రైలు ప్రయాణ ఉల్లంఘనలపై ఈ కేసులు నమోదు చేశారు. రైలు ప్రయాణ నిబంధనల్ని ఉల్లంఘించిన వారిపై కొరడా ఝళిపించడం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని తెచ్చి పెట్టారు. వీటిలో 5810 కేసులు టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై నమోదు చేశారు. వారి నుంచి రూ.61.02లక్షల జరిమానాలు వసూలు చేశారు. దీంతో పాటు అనధికారిక ప్రయాణాలపై 6900 కేసులు నమోదు చేశారు. వీటి ద్వారా రూ.41.33లక్షల జరిమానాలు వసూలు చేశారు.35ఏళ్ల కెరీర్‌లో మాథ్యూ జిఎం అవార్డుతో పాటు డిఆర్ఎం అవార్డు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ అవార్డులు పొందారు. అత్యధిక కేసులు నమోదు చేసిన అధికారికి జిఎం నుంచి అభినందనలు దక్కాయి.మరోవైపు సికింద్రబాద్ రైల్వే డివిజన్‌లో కూడా మరో ఏడుగురు అధికారులు కోటికి పైగా జరిమానాలు వసూలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం తొమ్మిది మంది రైల్వే తనిఖీ సిబ్బంది ఏకంగా రూ.9.62 కోట్లు వసూలు చేశారు. సగటున ఒక్కొక్కరూ రూ.కోటిని మించి వసూలు చేశారన్నమాట.టికెట్ లేకుండా ప్రయాణించేవారు, ముందస్తు బుకింగ్ లేకుండా సామగ్రి తరలించేవారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేయటంలో తొమ్మిది మంది టికెట్ తనిఖీ సిబ్బంది చురుగ్గా వ్యవహరించి పెద్దమొత్తంలో పెనాల్టీ వసూలు చేశారు.ఒక్కో అధికారి రూ.కోటికిపైగా పెనాల్టీ వసూలు చేయటం రైల్వే చరిత్రలోనే తొలిసారి కావటం విశేషమని రైల్వే అధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ డివిజన్ నుంచి ఏడుగురు, గుంతకల్, విజయవాడ డివిజన్ల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఈ ఘనత సాధించారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ నటరాజన్ 12,689 మంది ప్రయాణికుల నుంచి ఏకంగా రూ.1.16 కోట్లు వసూలు చేశారు. వీరిని దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ విజయవాడలో ప్రత్యేకంగా అభినందించారు.

# ఆన్ లైన్ విధానంలో టీఎస్ పీఎస్సీ

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో పోటీపరీక్షల నిర్వహణ విధానంలో కీలక మార్పులు చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. ఈ మేరకు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టబోతుంది. ఇకపై ఉద్యోగ నియామకాలకు సంబంధించిన రాతపరీక్షలను వేగంగా నిర్వహించి, వెంటనే ఫలితాలు వెల్లడించే దిశగా.. ఆన్‌లైన్ విధానంవైపు అడుగులు వేస్తోంది. పరీక్ష పత్రాల తయారీ, భద్రత, తదితర సాంకేతిక ఇబ్బందులు లేకుండా భారీ సంఖ్యలో ప్రశ్నలనిధి రూపొందించి, అభ్యర్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ విడతల వారీగా పరీక్షలు నిర్వహించనుంది. ప్రస్తుతం 25వేల మంది అభ్యర్థులు హాజరయ్యే పరీక్షలకు మాత్రమే కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తూ వస్తోంది. అంతకు మించి అభ్యర్థులు హాజరయ్యే పరీక్షలకు ఈ విధానాన్ని విస్తరించనుంది. అభ్యర్థులందరికీ ఒకేసారి కాకుండా విడతల వారీగా పరీక్షలు నిర్వహించి, నార్మలైజేషన్ విధానం అమలు చేయాలని కమిషన్ భావిస్తోంది. ఇందులో భాగంగానే పోటీపరీక్షల నిర్వహణ విధానంలో కీలక మార్పులు చేయాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) భావిస్తోంది. ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు అడుగులు వేస్తోంది.ప్రస్తుతం 25 వేల మంది అభ్యర్థులు హాజరయయే పరీక్షలకు మాత్రమే కంప్యూటర ఆధారిత పరీక్ష నిర్వహిస్తున్నారు. అయితే అంతకుమించి అభ్యర్థులు హాజరయ్యే పరీక్షలకు కూడా ఈ విధానాన్ని విస్తరించాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. అభ్యర్థుల సంఖ్య ఎంత ఉన్నా విడదల వారీగా ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహించాలని చూస్తోంది. తొలుత ప్రొఫెషనల్ పోస్టుల ఉద్యోగాలతో ప్రారంభించి, భవిష్యత్తులో అన్ని ఉద్యోగాలకు అమలు చేయాలని నిర్ణయించింది.పరీక్షలను సీబీఆర్‌టీ లేదా ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ ప్రకటనలో స్పష్టంగా పేర్కొంది. ఇతర రాష్ట్రాల పీఎస్సీల్లో ఈ విధానం ఇప్పటికే అమలవుతున్నందున ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే వెటర్నరీ అసిస్టెంట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఏఎంవీఐ, పాలిటెక్నిక్ లెక్చరర్లు, ఏఈ, ఏఈఈ తదితర పరీక్షలకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తులు చేస్తోంది. గ్రూపు సర్వీసుల ఉద్యోగాలకు ఈ విధానం అమలు చేయాలని గతంలోనే భావించినప్పటికీ, నిరుద్యోగుల్లో కొంత గందరగోళం నెలకొంటుందని పాత విధానాన్ని కొనసాగించింది. ఆన్‌లైన్ రాతపరీక్షలను మొదటగా ప్రొఫెషనల్ పోస్టుల ఉద్యోగాలతో ప్రారంభించి, తర్వాత అన్ని ఉద్యోగాలకు అమలు చేయాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల పీఎస్సీల్లో ఈ విధానం ఇప్పటికే అమలవుతున్నందున ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఎస్సెస్సీ, ఐబీపీఎస్ తరహాలో.. స్టాఫ్ సెలక్షన్ సర్వీస్ కమిషన్, ఐబీపీఎస్, ఇతర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల తరహాలోనే 'నార్మలైజేషన్' విధానాన్ని అమలు చేసే యోచనలో టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థుల సంఖ్య ఓవైపు గణనీయంగా పెరుగుతోంది. లక్షల సంఖ్యలో అభ్యర్థులకు ఒకేరోజున పరీక్షలు నిర్వహించడం కష్టసాధ్యమే. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు విడతల వారీగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నాయి. ఒక్కోసారి ఈ పరీక్షలు వారం రోజులపాటు జరుగుతున్నాయి.

# సుందర్ పిచాయ్ కు ఎంప్లాయిస్ లెటర్

**న్యూఢిల్లీ :**

గూగుల్ ఈ మధ్యే లేఆఫ్‌లు ప్రకటించింది. ఒకేసారి 12 వేల మందిని తొలగించనున్నట్టు వెల్లడించింది. ఇప్పటికే పలు బడా కంపెనీలు కూడా లేఆఫ్‌లు ప్రకటించాయి. అయితే...గూగుల్ ఉద్యోగులు మాత్రం కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్‌కు షాక్ ఇచ్చారు. ఉద్యోగులను కాస్త గౌరవంగా చూసుకోవాలంటూ లెటర్ రాశారు. 1,400 మంది ఉద్యోగులు ఈ మేరకు పిటిషన్‌పై సైన్ చేశారు. ఈ లెటర్‌లో పలు డిమాండ్‌లు చేశారు. కొంత కాలం పాటు రిక్రూట్‌మెంట్‌ను ఆపేయాలని తేల్చి చెప్పారు. ఒకవేళ రిక్రూట్‌మెంట్ జరిగినా...ఇప్పటికే జాబ్ పోయి అవకాశం కోసం చూస్తున్న వారికే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అత్యవసర సమయాల్లో సెలవు తీసుకోవాల్సి వస్తే వాటిని పెయిడ్ ఆఫ్‌గా పరిగణించాలి. ఉదాహరణకు పేరెంటల్ సెలవులను కోట్ చేశారు ఉద్యోగులు. అంతే కాదు. సంక్షోభంలో ఉన్న దేశాల్లోని ఉద్యోగులను తొలగించకుండా చూడాలని సూచించారు. ఇందుకు ఉక్రెయిన్‌ను ఉదాహరణగా చూపించారు. వీసా సంబంధిత సమస్యల్నీ పరిష్కరించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వర్క్‌ఫోర్స్‌ను తగ్గిస్తున్న ట్రెండ్ కొనసాగుతున్నప్పటికీ...దీనిపై తాము మాట్లాడాల్సిన అవసరముందని అన్నారు. అందుకే అంతా ఒక్కటై ఈ లేఖ రాస్తున్నట్టు వెల్లడించారు.

ఈ ఏడాది జనవరిలో గూగుల్ పేరెంట్ కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో 6% మందిని తొలగిస్తున్నట్టు తెలిపింది. కరోనా తరవాత పరిస్థితులు మారిపోయాయని, ఖర్చులు తగ్గించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని స్పష్టం చేసింది. గూగుల్ మాత్రమే కాదు. ఈ లిస్ట్‌లో మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ లాంటి బడా కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే...ఇప్పుడు ఉద్యోగులు వేసిన పిటిషన్‌పై గూగుల్ ఇంకా స్పందించలేదు. అమెరికాలో ఈ లేఆఫ్‌ల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. కొంత మందినైతే అప్పటికప్పుడే తొలగించేస్తున్నారు. ఉద్యోగులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను అసలు పట్టించుకోడం లేదని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుందర్ పిచాయ్‌కు ఈ పిటిషన్ చేరే లోపు మరింత మద్దతు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు ఉద్యోగులు. మెటాలో భారీ మొత్తంలో లేఆఫ్‌లు కొనసాగుతున్న క్రమంలో మార్క్ జుకర్ బర్గ్ మెయిల్ ఒకటి వైరల్ అవుతోంది. 2010లో ఫేస్‌బుక్ ఎంప్లాయ్‌లకు "దయచేసి రిజైన్ చేయండి" అంటూ జుకర్ పంపిన మెయిల్ ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఓ ఉద్యోగి ఎంతో కీలకమైన అంతర్గత సమాచారాన్ని వేరే వాళ్లకు పంపాడని ఆరోపించింది ఫేస్‌బుక్. ఈ మేరకు "జూశ్రీవజీబవ తీవబతిణని" సబ్జెక్ట్ లైన్‌తో మెయిల్ పంపాడు. ఇంతకన్నా నమ్మకద్రోహం ఇంకేం ఉండదు అంటూ ఆ ఉద్యోగిపై ఫైర్ అయ్యాడు. దాదాపు 13 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటన..ఇప్పుడు ద్వారా వెలుగులోకి వచ్చింది. "అనీనిటతిటవనిబితిజీశ్రీ - ఆనీ జొనీబి వాష్ట్రజీతీవ" అనే లైన్‌తో స్టార్ట్ చేసి ఆ ఉద్యోగికి మెయిల్ పంపాడు జుకర్. "మేం కొత్త మొబైల్ ఫోన్ తయారు చేస్తున్నామని మీరు చెబుతున్నారు. మాకు అలాంటి ఆలోచనే లేదు. దీనిపై నేను క్లారిటీ ఇచ్చాను. ఎంతో మందికి సమాధానం చెప్పాను. మేం ఏం చేస్తున్నామో వివరించాను. యాప్స్‌ను ప్రజలకు ఇంకా ఎలా దగ్గర చేయాలన్నది మాత్రమే ఆలోచిస్తున్నాం. ఇంత కీలకమైన సమాచారాన్ని బయటి వాళ్లకు చెప్పడం అంటే నమ్మకద్రోహమే. ఈ సమాచారం ఎవరు లీక్ చేసినా సరే వెంటనే రిజైన్ చేయండి. ఇది తప్పేం కాదని మీరు భావిస్తే వెంటనే వెళ్లిపోండి. ఒకవేళ మీరు రిజైన్ చేయకపోతే మేమే మీరెవరో కనుక్కుని మరీ బయటకు పంపాల్సి ఉంటుంది. "

## సిట్ విచారణకు హాజరైన రేవంత్

**హైదరాబాద్ :**

ఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై వ్యవహారంలో సిట్ దర్యాప్తు రాజకీయరంగు పులుముకుంది. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులకు నోటీసులు ఇచ్చింది సిట్. గురువారం సిట్ ముందు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరయ్యారు. రేవంత్ రెడ్డికి సిట్ నోటీసులకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు పిలుపునిచ్చాయి. దీంతో కాంగ్రెస్ కీలక నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో సిట్ కార్యాలయానికి వెళ్లే సమయంలో ఉద్రిక్తత నెలకొంది. రేవంత్ రెడ్డికి నోటీసులకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేవంత్ తో పాటు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. సిట్ కార్యాలయం లోపలికి రేవంత్ రెడ్డిని మాత్రమే అనుమతించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సిట్ కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రేవంత్ పాటు సిట్ కార్యాలయం వద్దకు భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకువచ్చారు. ఐటీ మినిస్టర్ కేటీఆర్ ను బర్త్ రఫ్ చేయాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సిట్ కార్యాలయానికి గ్రూప్ 1 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారి వివరాలతో రేవంత్ రెడ్డి వచ్చారు. సిట్ కార్యాలయంలోపలికి రేవంత్ రెడ్డిని మాత్రమే అనుమతించారు పోలీసులు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్ కాదు సీబీఐ విచారణ జరిపించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ అక్రమాల పుట్ట అని తేలిపోయిందని ఆరోపించారు. పెద్దల హస్తం లేనిదే పరీక్ష పత్రాలు లీకేజీ సాధ్యం కాదని ప్రజలకు అర్థమైందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్ ? కేటీఆర్ అండ్ కో నియమించిన "సిట్" విచారణకు పిలిచిందన్నారు. తప్పును ఎత్తి చూపడమే నేరమట, ఈ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని రేవంత్ రెడ్డి అన్నారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి విచారణ కోసం కొట్లాడుతానన్నారు. 30 లక్షల నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు. కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన నేపథ్యంలో మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో రేవంత్ రెడ్డికి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బయలుదేరుతున్న సమయంలో పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. తెలంగాణ నిరుద్యోగ యువతకి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ అన్నారు. సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. అసలైన నిందితులను వొదిలేసి ప్రతిపక్షాల మీద పడటం కరెక్ట్ కాదన్నారు. న్యాయం జరిగేవరకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అద్దంకి దయాకర్ అన్నారు.

## భోజనాలు వృధా చేయకండి

**చాగలమర్రి**

నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామంలో ఎక్కడైనా ఫంక్షన్లలో , శుభకార్యములలో , ఇతర కార్యక్రమములలో భోజనాలు మిగిలితే అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ ని సంప్రదించాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లంకొండు సాయి సుదర్శన్ రావు కోరారు. దాదాపుగా ఇలాంటి సోషల్ సర్వీస్ కరోనా టైం నుంచి చేస్తూ ఉన్నారు.అంతే కాకుండా ఎంత టైం అయిన పర్లేదు ఎంత రత్రైన పర్లేదు పగలు , రాత్రి అని వేళలు చూడము అని అన్నారు.ఈ విధంగా చాగలమర్రి గ్రామం మరియు పరిసర ప్రాంతాల్లో మిగిలిన అన్నాన్ని వృధా చేయకుండా అనార్థులకు , సాధువులకు పంచడం జరుగుతుంది.అదే విధంగా అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ కు ఆటో సహకరిస్తూ ఊర్లో వున్న లేకున్నా నేను ఉన్నాను నేను కూడా దగ్గరుండి మిగిలిన బోజనాలు పెట్టిస్తు ఫౌండేషన్ కు ఆటో సహకరిస్తున్న ఆటో వాసు అన్న. వృధా కాకుండా మిగిలిన బోజనాలు ఉంటే క్రింది నంబర్లను 9948340319 , 8639004420 సంప్రదించమని వ్యవస్థాపకుడు వల్లంకొండు సాయి కోరారు. జన్మదినం , పెళ్లిరోజు చేసుకున్నప్పుడు మా ఫౌండేషన్ నీ సంప్రదిస్తే ఒక్క పూట అన్నదానానికి సహకరిస్తే వృద్ధాశ్రమంలో వృద్ధులకు , అనాథ ఆశ్రమంలో అనాథలకు పెట్టించడం జరుగుతుంది. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**కాకినాడ**

కాకినాడ జగన్నాథపురంలోని 18వ డివిజన్ లోని తూరంగిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారంలో రెండు కమ్యూనిటి హాల్స్ ను పూర్తి చేసుకొని ప్రారంభించుకోవడం జరిగిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు.కాకినాడ జగన్నాథపురంలోని తూరంగిపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటి హాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మజ, వైకాపా నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నసాగర్ లు రాగా డివిజన్ మాజీ కార్పోరేటర్ చవ్వాకుల రాంబాబు, డివిజన్ ఇన్ చార్జ్ ధోని చిట్టిబాబులు ఘన స్వాగతం పలికారు. నూతన కమ్యూనిటి హాల్స్ ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లో గడప గడప " కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ప్రచార రథాల ద్వారా ధర్మ ప్రచారం

**విజయవాడ :**

రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఏడు ప్రముఖ దేవాలయాల ప్రచార రథాల ద్వారా పెద్ద ఎత్తున ధర్మ ప్రచార కార్యకమాన్నిచేపట్టనున్నట్టు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ కమిటీ 3వ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో రోజువారీ జరగాల్సిన నిత్య పూజా కార్యక్రమాలన్నీసక్రమంగా జరగాలని ఆ విషయంలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవాలయాలకు చెందిన అనగా సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాల ప్రచార రథాల ద్వారా హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్నిచేపడు తున్నట్టు చెప్పారు. ప్రజల్లో హిందూ ధర్మ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను, నైతిక విలువలను పెంపొందించడం, కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను చాటి చెప్పడమే లక్ష్యంగా ఈ ధర్మప్రచార కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. విధంగా సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అంశంపైన పురాణ ఇతిహాసాలకు సంబంధించి చిన్నచిన్నపుస్తకాలను ప్రచురించి ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా వారిలో హిందూ ధర్మ పరిరక్షణపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ ప్రచార రథాలు ఆయా గ్రామాలు, పట్టణాల సందర్శనకు సంబంధించిన తేదీలు, సమయాలు ముందుగానే తెలియజేసి వివిధ దేవాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఆధ్యాత్మికవేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ అధికారులకు సూచించారు. ప్రతి ప్రచార రథానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వారి ద్వారా ఈ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.రాష్ట్ర శ్రేయోభివృద్ధే లక్ష్యంగా అనగా సంపద,రక్షణ,శక్తి పెంపొందాలనే ఆశయంతో విజయవాడలో లక్ష్మీ సుదర్శన రాజశ్యామల సుదర్శన సహిత మహాలక్ష్మీ యజ్ఞాన్ని నిర్వహించాలని సంకల్పించామని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. దీనికి సంబంధించి ఈ సమావేశంలో పాల్గొన్న ఆగమ, జ్యోతిష్య పండితుల నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. వీడియా లింక్ ద్వారా పెద్ద జియంగార్ పీఠాధిపతి, పుష్పగిరి పీఠాధిపతితోపాటు టిటిడి ఇఓ ధర్మారెడ్డి పాల్గొని ఈ యజ్ఞం నిర్వహణకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. ఈయజ్ఞం నిర్వహణకు సంబంధించిన తేది, ముహూర్తం తదితర ఏర్పాట్లపై దేవాదాయశాఖతోపాటు సంబంధిత శాఖల సమన్వయం తో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార కార్యక్రమం, త్వరలో నిర్వహించనున్నయజ్ఞం నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలను అందించారు. ధార్మిక పరిషత్ సమావేశంలో అర్చకులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, వివిధ ట్రస్ట్ బోర్డుల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు, కారుణ్య నియామకంలో చేరిన వారికి తగిన శిక్షణ కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. దేవాదాయ శాఖ పరిదిలో ఉన్న సమస్యలపై కూడా త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించటం ద్వార, ఆధ్యాత్మిక వేత్తలు, స్వామీజిల సలహాలతో ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహింటానికి అవసరం అయిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# క్షేత్రస్థాయి అవగాహనకోసం ఆత్మీయ సమ్మేళనలు

**హైదరాబాద్**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్రింది స్థాయిలో పరిస్థితులు తెలుసుకునేందుకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు గాంధీ అన్నారు. మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా హైదర్ నగర్ డివిజన్లో ఈరోజు కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తన హయాంలో ఈ ఒక్క డివిజన్ కే 190 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు ఇంకా మిగిలి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# వెంకటాపురంలో కాంగ్రెస్ ఇంటింటి పాదయాత్ర

**రంగారెడ్డి**

మేడ్చల్ జిల్లా అల్వాల్ సర్కిల్ వెంకటాపురం 135 డివిజన్ పరిధిలోని యాదమ్మ నగర్, ఇందిరానగర్ బస్తిలలో గురువారం మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఇంటింటికి పాదయాత్ర చేపట్టారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయల రుణమాఫీ, 500 రూపాయలకే కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల రూపాయల సాయం, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీసం ఐదువేల రూపాయల పెన్షన్, మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దోమలపై యుద్ధం ప్రకటించిన అధికారులు

**విజయవాడ**

విజయవాడ నగరంలో రోజు రోజుకి పెరిగిపోతున్న మలేరియా, డెంగ్యూ ,, టైఫాయిడ్ వంటి జ్వరాలకు అధికారులు వణికిపోతున్నారు .దోమల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఎమ్.ఎల్ ఆయిల్ చల్లడం, గుర్రపు డెక్క ఎండిపోవడానికి మందులు చల్లటం తో పాటు ఇంటింటికి సర్వే కూడా చేపట్టారు . ముఖ్యంగా బుడమేరులో దోమల కేంద్రాలను గుర్తించి అక్కడ డ్రోన్ సాయంతో ఆయిల్ చల్లుతున్నారు. ఇంతేకాక బోట్ పై



తిరిగి దోమల నిల్వ కేంద్రలను ధ్వంసం చేస్తున్నారు .ఎక్కడ జ్వరాలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని బయాలజిస్ట్ సూర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ యూ.ఓ హరిశంకర్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# 103 మందికి ఫుల్ మార్క్స్....

**హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణపై దూకుడు పెంచింది. నిందితులను విచారిస్తున్న సిట్.. కీలక ఆధారాలు సేకరిస్తుంది. పేపర్ లీక్ ఘటనలో మరో ముగ్గురు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగుల హస్తం ఉన్నట్లు సిట్ గుర్తించింది. వాళ్లు కూడా పేపర్ లీక్‌లో భాగస్వామ్యం అయ్యారని గుర్తించిన సిట్.. వాళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారు. వాళ్లకోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సిట్ అధికారులు తెలిపారు. అయితే, వాళ్ల వివరాలేవీ తెలియరాలేదు. ఈ ముగ్గురే కాకుండా టీఎస్పీఎస్సీలో పనిచేస్తున్న మరో 30 మందికి సిట్ నోటీసులు జారీ చేసింది. అంతేకాకుండా గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ర్యాంకు సాధించిన వాళ్లలో నిందితుడు రాజశేఖర్ సన్నిహితుడు సురేశ్ ఉన్నట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. టీఎస్‌పీఎస్సీ నుంచి పేపర్ తీసుకొచ్చి సురేష్‌కు ఇచ్చినట్లు గుర్తించారు.

పేపరులీకేజీలో నిందితులుగా ఉన్న 9 మందిని 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్.. సురేష్ ఎంత మందికి పేపర్ ఇచ్చాడన్నదానిపై ప్రశ్నించింది. రేణుక, నీలేష్, గోపాల్ మధ్య జరిగిన రూ.14 లక్షల లావాదేవీలపై, రాజశేఖర్ వాట్సాప్ చాటింగ్‌పైనా సిట్ అధికారులు ఆరా తీశారు. పలు అంశాలపై ఆధారాలు సేకరించినట్లు సైబర్‌క్రైమ్ టెక్నికల్ టీమ్ తెలిపింది. టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తున్న 42 మందికి సిట్ నోటీసులు ఇచ్చింది. ఝాఖూఅలో పనిచేస్తున్న వారందరినీ విచారిస్తున్నట్లు దర్యాప్తు సంస్థ చెప్పింది. ప్రవీణ్, రాజశేఖర్‌తో సంబంధాలున్న వారందరిపై విచారణ చేపట్టారు. ఇప్పటికే శంకర్‌లక్ష్మిని రెండుసార్లు, టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌తో సంబంధం ఉన్నవారందరినీ సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు.గ్రూప్-1లో 103 మందికి 100 మార్కులుపైగా వచ్చినట్లు గుర్తించారు. వీరిలో 20 మంది టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం చేస్తూ.. ర్యాంక్‌లు సంపాదించినవారు ఉన్నట్లు తేలింది. ఈ 20 మందిలో మెయిన్స్ పరీక్షకు 8 మంది అర్హత సాధించినట్లు సిట్ విచారణలో బహిర్గతమైంది. ఇందులో ఇద్దరికి 100కి పైగా మార్కులు వచ్చాయి. అయితే పరీక్ష రాసిన 20 మందిలో ముగ్గురిని నిందితుల జాబితాలో సిట్ చేర్చింది.

**పేపర్ లీకేజీలో ముగిసిన నిందితుల కస్టడీ..**

టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసు ఐదోరోజు సిట్ విచారణ ముగిసింది. 9 మంది నిందితులను సిట్ అధికారులు 7 గంటలపాటు ప్రశ్నించారు. సైబర్ క్రైమ్ టెక్నికల్ టీమ్ సాంకేతిక ఆధారాలు సేకరించింది. రేణుక, నీలేష్, గోపాల్ మధ్య రూ.14 లక్షల ఆర్థిక లావాదేవీలపై సిట్ అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. రాజశేఖర్ కాంటాక్ట్స్, వాట్సాప్ చాటింగ్ వివరాలపై దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. రాజశేఖర్ స్నేహితుడు సురేష్ ఎవరికైనా ప్రశ్నాపత్రం లీక్ చేశాడా?.. అనే కోణంలో సురేష్?ను విచారించారు. సురేష్, రాజశేఖర్ లావాదేవీలు, వాట్సాప్, కాల్ డేటాపై సిట్ అధికారులు ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీలో పని చేస్తున్న 30 మందికి పైగా ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. వీరిలో ఒక్కొక్కరిని సిట్ అధికారులు విడివిడిగా విచారణ చేయనున్నారు. మార్చి 23న మరోసారి కాన్ఫిడెన్షియల్ రూం సెక్షన్ అధికారి శంకర్ లక్ష్మీ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నారు. టీఎస్ పీఎస్సీ ఉద్యోగులతోపాటు..లీకేజీలో కీలకంగా ఉన్న రేణుకతో సన్నిహితంగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకలు, అభ్యర్థులను సైతం విచారించాలని నిర్ణయించింది సిట్. గ్రూప్ 1 ర్యాంక్ సాధించిన రాజశేఖర్ ఫ్రెండ్ రమేష్ పాత్రపైనా అనుమానాలు ఉండటంతో అతన్ని కూడా మరోసారి విచారించాలని నిర్ణయించారు.టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితుల నుంచి సిట్ అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి గ్రూప్-1 పేపర్ కోసం జూన్ నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టి, అక్టోబర్ మొదటి వారంలో పేపర్‌ను అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. పేపర్ లీకేజీ ఘటనలో నిందితులుగా 9 మందిని మూడో రోజు సిట్ అధికారులు విచారించారు. వీరి నుంచి పలు ప్రశ్నలపై సమాధానాలు రాబట్టారు. మొదటి రెండు రోజులు ఒక్కొక్కరిని, ఇద్దరిద్దరిని కలిపి విచారించిన సిట్, మూడో రోజు కొద్ది సేపు అందరినీ కలిపి విచారించింది.తెలంగాణలో రోజురోజుకి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం మరింత వేడెక్కుతోంది. 'గ్రూప్-1' ప్రశ్నపత్రాన్ని రాజశేఖర్ రెడ్డి ముఠా అనేక మందికి అమ్మినట్లు సిట్ భావిస్తోంది. ప్రస్తుతం ఎవరెవరికి అందిందనేది నిగ్గు తేల్చేందుకు ప్రయత్నిస్తోంది. గ్రూప్-1 పరీక్షలో సుమారు 25 వేల మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. అందులో 100 స్కోర్ దాటిన వారు ఎంతమంది ఉన్నారు? వారికి ప్రవీణ్, రాజశేఖర్, రేణుకకు ఎలాంటి సంబంధాలున్నాయనే అంశాలపై ఫోకస్ పెట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం 100కు పైగా మార్కులు సాధించిన 'గ్రూప్-1' అభ్యర్థుల జాబితా రూపొందించిన సిట్ అధికారులు వారిలో అనుమానితులను విచారించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

# మళ్లీ హైదరాబాద్ లో వానలు...

**హైదరాబాద్ :**

డిచిన కొన్ని రోజులుగా రెండు రాష్ట్రాల్లో భారీగా వర్షం కురిసిన విషయం తెలిసిందే. పలు జిల్లాల్లో వడగండ్లు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. ఇదిలా ఉంటే తాజాగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయితే తాజాగా నగరవాసులకు హైదరాబాద్ వాతావారణ శాఖ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. ఇవాళ, రేపు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ మహా నగరంలోని ఆరు జోన్‌లకు వాతావరణ శాఖ హెచ్చరీకలు జారీ చేసింది. నగరంలోని ముఖ్యప్రాంతాలైన చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లిలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ఈ రెండు రోజుల్లో నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నగర వాసులు అప్రమత్తతతో ఉండాలని అధికారులు సూచించారు. అవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని సూచించారు. లోటత్తు ప్రాంతాల ప్రజలు కాస్త జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# అనుమతి లేకుండా పరీక్షలు రాస్తున్న ఉద్యోగులు

**హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తవ్వేకొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయ్. చైన్ లింక్ మాదిరిగా ఒకర్ని పట్టుకుంటే మరొకరు దొరుకుతున్నారు. ఇప్పటివరకు ఇంటి దొంగలు ఇద్దరే అనుకుంటే, ఇప్పుడు మరికొందరు ఇంటిదొంగల వ్యవహారం బయటకొచ్చింది. టీఎస్‌పీఎస్సీలో పని చేస్తున్న ఉద్యోగులు ఎలాంటి అనుమతి తీసుకోకుండా పరీక్ష రాసినట్లుగా తెలుస్తోంది. వీరంతా ఔూఅ తీసుకోకుండా గ్రూప్-1 ఎగ్జామ్ రాసినట్లుగా గుర్తించారు. ఇందులో మొత్తం 26మంది టీఎస్‌పీఎస్ ఉద్యోగులు ఉనట్లుగా తేల్చారు. కమిషన్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోకుండానే ఎగ్జామ్ రాశారు ఉద్యోగులు. 4నెలల లీవ్‌లు వాడుకోకుండానే ఎగ్జామ్ రాశారు పర్మినెంట్ ఉద్యోగులు. అదే విధంగా ఉద్యోగానికి రిజైన్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎగ్జామ్ రాశారని తేల్చిరు. ఇప్పటికీ ఉద్యోగంలోనే కొనసాగుతున్నారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు.ఝాఖూఅ ఉద్యోగుల్లో చాలా మంది గ్రూప్-1 రాస్తే అందులో 10మంది క్వాలిఫై కావడం, వాళ్లల్లో కొందరికి 100కి పై మార్కులు రావడం అనుమానాలు రేపుతున్నాయి. ఈ 10మందిలో ముగ్గురు ముగ్గురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాగా, ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులు. దాంతో, ముందు ఇంటి దొంగలపై ఫోకస్ పెట్టింది సిట్. గ్రూప్-1 ఎగ్జామ్ రాసిన ఝాఖూఅ ఉద్యోగులకు పేపర్ లీకేజీతో సంబంధముందా? లేదా? అనే కోణంలో దర్యాప్తు చేస్తోంది సిట్.

# మోడీతో కోమటిరెడ్డి భేటీ

**నల్గొండ :**

భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రధాని మోదీని కలిశారు. గురువారం (మార్చి 23) కోమటిరెడ్డి ప్రధానితో భేటీ అయ్యారు. అనంతరం అనంతరం ఆయన మీడితో మాట్లాడారు. వర్షాల వల్ల పంట నష్టం విషయంలో మోదీని కలిసినట్లుగా చెప్పారు. కేంద్రం నుంచి ఓ టీమ్‌ను పంట నష్టంపై అంచనాకు తెలంగాణకు పంపాలని కోరినట్లు వెల్లడించారు. తన నియోజకవర్గంలో జాతీయ రహదారులపై చర్చించానని కూడా పేర్కొన్నారు. ఎల్బీ నగర్ నుంచి మెట్రో రైలును హయత్ నగర్ వరకూ పొడిగించాలని కోరానని అన్నారు. తన వినతుల పట్ల ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి వివరించారు."నేను - ప్రధాని మోదీ మాట్లాడుకున్న వాటిలో కొన్ని అంశాలు మీడియాతో చెప్పలేనివి ఉంటాయి. నేను లేవనెత్తిన అన్ని అంశాలపై ప్రధాని చాలా సానుకూలంగా స్పందించారు. వాటికి రెండు, మూడు నెలలలో ఆయన అన్నీ మంజూరు చేసే అవకాశం ఉంది. ప్రధానికి నేను ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. తెలంగాణలో వడగళ్ల వానతో రైతులు నష్ట పోయారు. కేంద్రం నుంచి పరిశీలనకు బృందాన్ని పంపాలని కోరాను" అని కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.



పంట నష్టంపై ఎల్లుండి ప్రధాని మోదీని కలుస్తానని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మొన్ననే చెప్పారు. ఎమ్మెల్సీ కవిత ఈడీ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్‌లో కేటీఆర్ పీఏ తిరుపతి హస్తం ఉందని వెంకట్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగుల ఉసురు కేసీఆర్ ప్రభుత్వానికి తగులుతుందని విమర్శించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నందున వారి కోసం నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద బ్లాక్ లెవెల్ క్లస్టర్ మంజూరు చేయాలన్నారు. నూతన టెక్నాలజీతో కూడిన అసో మిషన్స్ కూడా భువనగిరి నియోజకవర్గంలోని చేనేత కార్మికుల కోసం మంజూరు చేయాలని అన్నారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు ఉన్న చేనేత కార్మిక కుటుంబాలను ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల పరిధిలోకి తీసుకు రావాలని విన్నవించారు.రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వడం లేదని ప్రధాని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినా, ఇవ్వకున్నా మొత్తం కేంద్రం భరించి ప్రాజెక్టును అమలు చేయాలని కోరాని అన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 6 వరుసలుగా విస్తరించడం గురించి మాట్లాడినట్లుగా తెలిపారు.

అయితే తాను కోరినవాటికి అనుకూలంగా ప్రధాని మోదీ చాలా సానుకూలంగా స్పందించారని.. ముఖ్యమైన పనులు మంజూరై పనులను ఒకటి రెండు నెలల్లో ప్రారంభిస్తారని తాను నమ్ముతున్నాన్నారు .తాను ఎంపీగా నా నియోజకవర్గ అంశాల గురించి మాత్రమే చర్చించానని అన్నారు. ప్రధాని హోదాలో అధికారులతో పాటు ఆయన ఉన్నప్పుడు రాజకీయాల గురించి ఎలా మాట్లాడగలం? తమ మధ్య ఎలాంటి రాజకీయ చర్చ అన్నదే రాలేదన్నారు.

# భార్యపై హత్యాయత్నం..భర్తకు పదేళ్ల జైలు శిక్ష

**కాకినాడ**

భార్య పై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ గురువారం 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000- జరిమానా విధించింది. 2018 వ సంవత్సం మేనెలలో ఈ ఘటన జరిగింది. పిఠాపురం లో ఐశ్వర్య గార్డెన్స్ లో బాధితురాలు ముమ్మిడి సుబ్బలక్ష్మి (30) భర్త సుబ్రహ్మణ్యం తో నివాసం వుంటుంది. భర్త బిలాస్ పూర్ రైల్వే లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. ఇద్దరు కలిసి కొండవరం వెళ్లి, తిరిగి వారి ఇంటికి ఐశ్వర్య గార్డెన్ కి వచ్చి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో నిందితుడు భార్య ప్రవర్తన పై అనుమానం పెంచుకొని, ఆమె పేరున ఉన్న ఆస్తిని 10 ఎకరాలు తన పేరున మార్చడం లేదని ద్వేషం పెంచుకుని చంపాలనే ఉద్దేశంతో, ఫిర్యాదిపై మత్తుమందు చల్లి, కత్తితో విచక్షణారహితంగా నరికి పారిపోయాడు. దాడిలో భార్య రెండు చేతులు మణికట్టుల వద్ద తెగిపోయాయి. ఎడమ మోచేయి మీద, మెడ మీద, కుడివైపు దవడ మీద కూడా గాయాలై ఉదయం 6 గం.ల సమయంలో ఆమెకు మత్తువదిలి కేకలు వేసింది. చుట్టుప్రక్కల వారు వచ్చి, వైద్యం నిమిత్తం 108 అంబులెన్స్ మీద కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రజా తపన
prajathapana.com













Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950